ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక



ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

Publisher&Editor: 9391690609,Office :7893003409

aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/

www.aksharamtelugudaily.com

# అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

ఆదివారం 2 జూన్ 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా


పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 73 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## మండుతున్న రోహిణి ఎండలు

ఎండలకు తోడు వడగాలులు
రుతు పవనాలతోనే ఉపశమనం

• 2లో



# మళ్లీ మోడీకే ప్రజల పట్టం

**మూడోసారి ప్రధానిగా మోడీ**
**దేశవ్యాప్తంగా ప్రజల తీర్పు**
**అన్ని ఎగ్జిట్ ఫలితాల్లో ఎన్‌డిఎకు మొగ్గు**
**400 సీట్ల సంఖ్యను చేరుకోదని వెల్లడి**
**ఇండియా కూటమికి పెరిగిన బలం**
**బలమైన ప్రతిపక్షంగా చేరకునే అవకాశం**



**న్యూఢిల్లీ,జూన్1(అక్షరం న్యూస్):**
మోడీ మూడోమారు ప్రధాని కావడం ఖాయమని ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించాయి. మరోమారు బిజెపి కూటిమిదే అధికారమని తేల్చింది. దాదాపు అన్ని సంస్థలు నంబర్ అటుఇటుగా ఎన్‌డిఎకు మరోమారు ప్రజలు పట్టం కట్టారని వెల్లడించాయి. అదే సందర్భంలో కాంగ్రెస్ గతం కన్నా భారీగా సీట్లను సంపాదించుకుంది. ఇండియా కూటమి కూడా గణనీయంగా సీట్లు సంపాదించి గట్టి ప్రతిపక్షంగా రాబోతోందని ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఇకపోతే ఈ దఫా 400 సీట్లు అన్న బిజెపి కలలు మాత్రం నెరవేరేలా కనిపించడం లేదు. దేశం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి శనివారం సాయంత్రి వివిధ సంస్థలు తమ సర్వేలను ప్రకటించాయి. వివిధ సర్వే సంస్థలు, మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసాయి. వివిధ సర్వేలు ప్రజల అభిప్రాయాలను సేకరించి
వాటన్నిటి ఆధారంగా దేశంలో ఎవరు అధికారంలోకి రానున్నారో అంచనా వేశాయి. ముచ్చటగా మూడో సారి కూడా ఎన్డీఏ కూటమి అధికారం చేపడుతుందని దాదాపు అన్ని సర్వేల ఫలితాలు చెబుతున్నాయి. ఎన్డీఏ కూటమి గరిష్టంగా 390 స్థానాల్లో గెలిచే అవకాశాలు ఉన్నాయి. రిపబ్లిక్ – పీమార్క్, ఇండియా న్యూస్ డీ వెల్లడించింది. డైనమిక్స్, రిపబ్లిక్ భారత్ మ్యాట్రిజ్ చేసిన సర్వేలు 300 పైగా స్థానాలు కమలం పార్టీ గెలుస్తుందని చెబుతున్నాయి. సుదీర్ఘంగా

మిగతా 2లో..

TOTAL SEATS 543

POLL OF POLLS

| | NDA | INDIA | OTH |
|---|---|---|---|
| AXIS MY INDIA | 361-401 | 131-166 | 8-10 |
| CVOTER | 353-383 | 152-182 | 4-12 |
| TODAY'S CHANAKYA | 385-415 | 96-118 | 27-45 |
| CNX | 371-401 | 109-139 | 28-38 |
| ETG | 358 | 132 | 53 |
| POLL OF POLLS | 379 | 136 | 28 |

# బీఆర్ఎస్ క్యాండిల్ ర్యాలీ

## గన్‌పార్క్ వద్ద ప్రారంభించిన కెసిఆర్




**హైదరాబాద్,జూన్1(అక్షరం న్యూస్):**
బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్యాండిల్ ర్యాలీని ప్రారంభించారు. గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీ కొనసాగనుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జంట నగరాల పార్టీ శ్రేణులతో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని హాజరయ్యారు. ఇదిలావుంటే అంతకుముందు కేసీఆర్ ట్రాఫిక్ జామ్‌లో

మిగతా 2లో..

## ప్రభుత్వ చిహ్నాం, విగ్రహాంపై అసెంబ్లీలో

# చర్చకు పెడతం

**రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంపై కేసీఆర్‌కు గౌరవమే లేదు..**
**తెలంగాణ గేయం రూపకల్పన పూర్తి బాధ్యత అందెశ్రీదే**
**డిమాండ్‌తోనే బీర్లకు కొరత.. విత్తనాల లోటు లేనే లేదు**
**లోక్‌సభ ఫలితాలు వంద రోజుల పాలనకు రెఫరెండమే!**
**9-12 ఎంపీ సీట్లు, కంటోన్మెంట్, ఎమ్మెల్సీ గెలుస్తం**
**తెలంగాణలో బీజేపీకి 4-5 సీట్లేనని నడ్డానే చెప్పిండు**
**కేసీఆర్ కోసమే ట్యాపింగ్ కేసు బీజేపీ సీబీఐకివ్వాలంటోంది**
**మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**





**హైదరాబాద్,జూన్1(అక్షరం న్యూస్):**
"సమ్మక్క, సారక్క, జంపన్నలను చంపినవారిగానే కాకతీయ రాజులను నేను చూస్తా. పన్నులు చెల్లించబోం అని అన్నందుకు ఆ గిరిజన యోధులపై దాడి చేసి హతమార్చారు. రుద్రమదేవి హయాం వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని రెడ్డి సామంతులు కాపాడారు. ప్రతాపరుద్రుడు వచ్చాక పద్మనాయకులను చేరదీశాడు. వారు చేయివ్వడంతో ఆ సామ్రాజ్యం పతనమైంది" అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వం సారనాథ్ స్థూపం నుంచి అశోక చక్రాన్ని స్వీకరించిందని.. ఇది ధర్మాన్ని చాటుతుందని పేర్కొన్నారు. తెలంగాణ చిహ్నం మార్పునకు కేంద్రం అనుమతి తీసుకుంటాం అని చెప్పారు. "రాష్ట్ర చిహ్నానికి సంబంధించి కళాకారులు కొన్ని నమూనాలిచ్చారు. వాటిపై చర్చలు జరుగుతున్నాయి.

మిగతా 2లో..

# సర్వం సిద్ధం..

**ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి.. 4న ఉదయం 8కి షురూ**
**ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, 8:30 నుంచి ఈవీఎంల లెక్కింపు**
**మధ్యాహ్నం 3కు తొలి ఫలితం, 5 వరకు అన్ని స్థానాల ఫలితాలు**
**34 కౌంటింగ్ కేంద్రాలు, 10 వేల మంది సిబ్బంది**
**అన్ని చోట్లా మూడంచెల భద్రత: సీఈఓ వికాసరాజ్**
**5న నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ లెక్కింపు**

**హైదరాబాద్,జూన్1(అక్షరం న్యూస్):**
రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) కార్యాలయం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కౌంటింగ్ కేంద్రాలు, హాళ్లు, టేబుళ్లు, అధికారులు, సిబ్బంది, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. మే 13వ తేదీన రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 4వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ తర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా 34 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట

మిగతా 2లో..



# ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

**ఏడు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్**
**బెంగాల్‌లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు**
**సీపీఎం, ఐఎస్‌ఎఫ్ నేతలు, కార్యకర్తల మధ్య ఘర్షణ**

న్యూఢిల్లీ,జూన్1: లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ ముగిసింది. మొత్తం ఏడు విడతల్లో జరిగిన ఎన్నికలు.. శనివారం జరిగిన ఏడో దశ పోలింగ్‌తో ముగిశాయి. దీంతో అందరి చూపు జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌వైపు పడింది. ఏడో దశలో భాగంగా



మిగతా 2లో..

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు దూరంగా సోనియా గాంధీ?



• 2లో

# అరవింద్ కేజ్రీవాల్‌కు దక్కని ఊరట..

## మళ్లీ తీహార్ జైలుకు వెళ్లనున్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జూన్1: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయ్యి మధ్యంతర బెయిల్ మీద బయటకు వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ మళ్లీ తీహార్ జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేజ్రీవాల్ తరఫున ఆమ్ ఆద్మీ పార్టీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు శనివారం తీర్పు రిజర్వ్ చేసింది. కాగా జూన్ 5న తీర్పును



మిగతా 2లో..

# పాకాల యేటి పై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం మరో ఉద్యమం

**-హామీలకు, శంకుస్థాపనలకే పరిమితమైన గత పాలకులు...**
**-కట్టేబోయిన శ్రీనివాస్ సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు...**

మహబూబాబాద్ /గార్ల /జూన్ 1/అక్షరం న్యూస్...

దశాబ్ద కాలం నుండి పెండింగ్ లో ఉండి రాంపురం ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారిన పాకాల చెక్ డ్యామ్ ఎత్తు పెంచి, ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి నాయకులు కట్టేబోయిన శ్రీనివాస్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయం లో మండల కమిటీ సమావేశం సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు,గార్ల మండల వైస్ ఎంపీపి కట్టేబోయిన శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు సంతోషమే,కాని దశాబ్ది కాలం నాటి హక్కు రాంపురం పాకాల యేటి హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం ఈ నాటి వరకు కూడా బ్రిడ్జి నిర్మాణం జరలేదని అన్నారు.గత ప్రభుత్వం పై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని అనేక పోరాటాలు నిర్వహించామని,ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు కాని అమలు నోచుకోలేదని అన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో రాంపురం, మద్దివంచ గ్రామ పంచాయతీల ఓట్లను దండుకోడానికి శిలాఫలకం పేరుతో శంకుస్థాపన చేసి తప్పించుకున్నారని అన్నారు.శంకుస్థాపన అయినప్పటి నుండి నేటి వరకు కూడా పనులు ప్రారంభించలేదని అన్నారు.వర్షాకాలం ప్రారంభం అవుతుందని, మరల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందని,ప్రత్యామ్నాయ దారి కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు.గార్ల మండల కేంద్రానికి వచ్చే విద్యార్థుల చదువుకి ఆటంకం కలుగుతుందని అన్నారు.3 నెలలు చదువుని ఆపేస్తున్నారని అన్నారు.ఇప్పుడన్న రాష్ట్ర ప్రభుత్వం అయిన హై లెవల్ బ్రిడ్జి




నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రజా ప్రభుత్వం కూడా బ్రిడ్జి నిర్మాణం విషయం పెడచెవిన పెడితే మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రాగం రమేష్, కృష్ణమూర్తి,వీరన్న,జనార్దన్,శివ, రమేష్,సక్కు, నాగయ్య,నాగేష్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సమతా, మమతల రాజ్య స్థాపనకై పోరు సలిపిన నాయకుడు జడ మల్లయ్య...

**-విప్లవోద్యమం లో తన రక్తాన్ని ప్రోక్షించిన జడ మల్లయ్య దీప దారి...**
**-జడ మల్లయ్య ఆశయాల సాధనకై పోరాడుదాం...**
**-గౌని ఐలయ్య సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి...**

అమరుడు జడ మల్లయ్య పీడిత, తాడిత,ప్రజల కోసం అహర్నిశలు పనిచేశాడని, సమతా, మమతల రాజ్యం కోసం పోరు సల్పాడని సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు.మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల పరిధిలోని,గోపాలపురం గ్రామంలో జడ మల్లయ్య వర్ధంతి సభ నిర్వహించారు. గుడుచుట్టు శంకర్,గణేష్ ల అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో గౌని ఐలయ్య ప్రసంగిస్తూ,అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూల్చడానికి ప్రజలు పోరాడాలని అప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానం వెలుగులో మల్లన్న పయనించాడని అన్నారు.అధికార మార్పిడి నుండి పేదలు,రైతాంగము, బతుకుల్లో చింతాకంతా మార్పు రాలేదని ఎండేటోనికి ఎండుతుంది, నిండేటోనికి నిండుతుంది అన్నట్టు దేశాలు అదాని,అంబానీ కార్పొరేట్ శక్తులు కోట్లకు పడగెత్తారని అన్నారు.గ్రామీణ ప్రాంతంలో పెత్తందారు శక్తులు, వారి తాబేదారులు,భూస్వామ్య వ్యవస్థను బలోపేతమైందని అన్నారు. మోడీ ఫాసిస్టు రాజ్యం కొనసాగుతుందని ప్రశ్నించే గొంతులను బంధీ చేస్తున్నాడని ఛత్తీస్గడ్ రాష్ట్రంలో ఖనిజ సంపదను దోచుకోవడానికి నక్సలిజం అనే పేరిట ఆదివాసులను బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని అన్నారు. అమరుడు జడ మల్లయ్య రాజ్యాధికారం కోసం, వ్యవసాయ విప్లవం కోసం, పనిచేసే విప్లవ పార్టీకి ఆకర్షితుడై విద్యార్థి యువజన ప్రాయములోనే అరుణ పతాకం చేబూనాడని అమరుల అడుగుజాడల్లో పయనించాడని అన్నారు.గోపాలపురం గ్రామము దాని పరిసర ప్రాంతాల్లో పెత్తందారులు, రివిజనిస్టుల కు వ్యతిరేకంగా పోరాడుతూ కూలి రేట్లు పాలేరుల జీతాలు పెంపుదల కోసం రైతాంగ సమస్యల



పరిష్కారం కోసం పోరాడుతున్న క్రమంలో అనేక అక్రమ కేసులు మోపినప్పటికి మడమతిప్పకుండా పోరాడాడని అన్నారు .మల్లయ్య మరణించినప్పుడు ఉన్న సమస్యలే నేటికి రెట్టింపు అయ్యాయని వాటి మార్పు కోసం పోరాడడమే శరణ్యమని, అక్రమాలు, దోపిడీలు, అవినీతికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే మల్లయ్యకు ఇచ్చే నిజమైన నివాళులని అన్నారు .ఈ సభకు ముందు గ్రామంలో ప్రదర్శన జరిపి మల్లయ్య స్తూపం పై అరుణ పతాకను ఎగురవేశారు.ఈ సభలో జడ సత్యనారాయణ, సక్రు,వీరభద్రం, మాన్య,గోళ్ళ వెంకన్న,బజార్,వై కొండల్ రావు, చింతల గురవయ్య,జడ శ్రీను, వెంకట నరసయ్య, ఉపేందర్,రుక్మారావు, లక్ష్మీబాయి,సుశీల,సునిత, ఉపేంద్ర ,తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే వానాకాలం పంట సీజన్ కు సమృద్ధిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-అవసరానికి మించి 50 శాతం అదనంగా ఉన్న విత్తనాల స్టాక్**
**-నకిలీ విత్తనాల విక్రయాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు**
**-బి.జి-3 పత్తి విత్తనాలను నిషేధించిన ప్రభుత్వం**
**-రైతులు లైసెన్సుడ్ డీలర్ల వద్ద నుంచి రశీదు పొంది విత్తనాలను కొనుగోలు చేయాలి**
**-విత్తనాలు లభ్యతపై రైతులకు సందేహాలు ఉంటే కాల్ సెంటర్ నెంబర్ 9573951060 కు ఫోన్ చేయాలి**
**-విత్తనాల స్టాక్ పై ఉన్న అపోహలను తొలగిస్తూ మీడియా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి ప్రతినిధి జూన్ -01 అక్షరం న్యూస్

రాబోయే వానాకాలం పంట సీజన్ కు మన జిల్లాలో సమృద్ధిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాల స్టాక్ డీలర్ల వద్ద ఉందని, రైతులు అనవసరపు ఆందోళనలు చెందవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో వానాకాలం విత్తనాల లభ్యతను వివరిస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,లి మన జిల్లాలో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వచ్చే వానాకాలం పంటకు ఎక్కడా విత్తనాల కొరత రాకుండా పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ఉన్న 353 విత్తన డీలర్ల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న లక్షా 55 వేల 496 మంది రైతులకు 2 లక్షల 77 వేల 720 ఎకరాల సాగు భూమి ఉందని, వీటిలో 2 లక్షల 8 వేల ఎకరాలలో వరి పంట, 60 వేల ఎకరాలలో పత్తి పంట, 12 వేల ఎకరాలలో కూరగాయలు పండ్లు ఇతర పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ప్రతి పంటకు సంబంధించి అవసరానికి మించి 50 శాతం అదనంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా విత్తనాల కొరత లేదని, ఎక్కడైనా విత్తనాల రవాణా, తదితర అంశాలలో చిన్న, చిన్న ఇబ్బందులు వచ్చి ఒకటి, రెండు రోజులు రైతులకు చేరడంలో ఆలస్యం కావచ్చని, విత్తనల స్టాక్ కు ఎక్కడ కొరత లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న పంటలు వారు వినియోగిస్తున్న విత్తనాలపై వ్యవసాయ అధికారుల ద్వారా సర్వే నిర్వహించి, సదరు విత్తనాలు సమీప విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. వానకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమయ్యే పచ్చి రొట్టె విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయని, వరి సన్న రకాల విత్తనాల స్టాక్ లు, పత్తి విత్తనాలలో 134 రకాల విత్తనాలు అధికంగా



ఉన్నాయని తెలిపారు.బీజి3 వంటి పత్తి విత్తనాలను నిషేధించడం జరిగిందని, వీటిని ఎక్కడా డీలర్లు విక్రయించకుండా చర్యలు తీసుకున్నామని, రైతులు ఎక్కడ కూడా ఈ విత్తనాలను ఉపయోగించవద్దని, ఎవరైనా ఈ విత్తనాలు విక్రయిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో ఉన్న ప్రతి విత్తనపు, ఎరువుల డీలర్ దుకాణాలను తనిఖీ చేస్తూ స్టాక్ పరిశీలిస్తున్నామని, ప్రతి దుకాణం వద్ద అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలు, వాటి రేట్లను నోటీస్ బోర్డ్ పై ఏర్పాటు చేయాలని, ప్రతి విక్రయం వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నామని తెలిపారు.

పోలీసు శాఖ సహకారంతో నకిలీ విత్తనాల విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని, రైతులు ప్రభుత్వం గుర్తించిన లైసెన్స్ విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు రశీదు తీసుకోవాలని, సీల్డ్ ప్యాకెట్లను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. విత్తనాల లభ్యతపై రైతులకు ఉన్న అపోహలు తొలగించేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, రైతులకు అపోహలు సందేహాలు ఉంటే కాల్ సెంటర్ నెంబర్ 9573951060 కు ఫోన్ చేయాలని కలెక్టర్ కోరారు.సామాజిక మాధ్యమాల్లో వచ్చే అబద్ధపు ప్రచారాలను రైతులు నమ్మవద్దని, జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేదని , రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట కార్యాచరణ అమలు చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. పత్రికా సమావేశంలో పాల్గొన్న లిలిరామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ,లి కల్తీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, రైతులు ప్రభుత్వం గుర్తించిన సర్టిఫైడ్ డీలర్లు వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని , విడిగా ఎక్కడా విత్తనాలు కొనుగోలు చేయవద్దని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కల్తీ విత్తనాలను రాకుండా అంతర్ జిల్లా అంతరాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. నకిలీ విత్తనాలపై ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని పోలీస్ కమిషనర్ కోరారు. ఈ పత్రిక సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోండి.

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బాబు**

నాగర్ కర్నూల్ జూన్ 1( అక్షరం న్యూస్)

ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న కేసు లో పరిష్కారానికి లోక్ అదాలత్ ను ఉపయోగించు కోవాలని నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రాజేష్ బాబు పిలుపునిచ్చారు శనివారం కోర్టు ఆవరణలో రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఈనెల 8 న నిర్వహించే రెండవ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడానికి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రాజేష్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోలీస్ అధికారులను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ. గత సంవత్సర కాలం నుంచి లోక్ అదాల త్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యాయని, మన జిల్లాలో రాజీ కుదుర్చుకునే కేసులు 8287 కేసులు ఉన్నాయని, జూన్ 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా పోలీస్ అధికారులు, న్యాయశాఖ అధికారులు కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఇరు పార్టీలు రాజీ కావడం వల్ల సమయభావము డబ్బు తగ్గుతాయని కక్షలు, కార్పణ్యాలు నశిస్తాయని , ఇరువర్గాల వారు సంతోషంగా ఉంటారని దీనివల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. పోలీస్ అధికారులు ఇరు వర్గాల వారికి నచ్చజెప్పి రాజీకుదురుచుకునే విధంగా చూ డాలని కోరారు. ఎక్సైజ్ , విజిలెన్స్ ఎలక్ట్రిసిటీ ,అధికారులతో మాట్లాడుతూ... కాంపౌండింగ్ అయ్యే కేసులు అన్ని పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని తెలిపారు.

జూన్ 8న జరగబోయే రెండవ జాతీయ లోక్ అదాలత్ ని విజయం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ జి సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి మౌనిక, మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే మమతా రెడ్డి, రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎన్ శ్రీనిధి, జిల్లా పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది దేవిక ,కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు




## పాముకాటుతో బాలిక మృతి

పెద్దపల్లి టౌన్ జూన్ 01 అక్షరం న్యూస్



పెద్దపల్లి పట్టణంలోని సాగ ర్ రోడ్డుకు చెందిన నిట్టూరు వైష్ణవి 11 శుక్రవారం రాత్రి పాముకాటుతో మృతి చెందింది బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఇంట్లో ఫ్రిడ్జ్ డోర్ తీసి బాటిల్ సీసా తీసుకునే క్రమంలో ఫ్రిడ్జ్ కింద నుంచి వచ్చిన పాము కాటు వేసింది ఎలుక కొరికి ఉంటుందని భావించిన కుటుంబ సభ్యులు బాలికను పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది

## కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శించుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే



పెద్దపల్లి టౌన్ జూన్ 01 అక్షరం న్యూస్

పెద్దహనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొండగట్టు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు శనివారం రోజున పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు లో శ్రీ. హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు మరియు రాష్ట్ర ప్రజలందరూ ప్రజాపాలనలో సుభిక్షంగా ఉండాలని ఆ స్వామి వారిని కోరుకోవడం జరిగింది అని తెలిపారు

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీపతి సాయితేజ**

పెద్దపల్లి టౌన్ జూన్ 01 అక్షరం న్యూస్



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీపతి సాయి తేజ విద్యార్థి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి పాఠశాలలో ఉన్న సమస్యలను తీర్చి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీపతి సాయితేజ సూచించారు జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాల కళాశాల అభివృద్ధి చేయాలని అన్నారు రంగాపూర్ పాఠశాల కాంపౌండ్ గోడ మరియు అబ్బాయిలకు వాష్ రూమ్స్ నిర్మించాలని అదేవిధంగా నిమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉన్నటువంటి గ్రామపంచాయతీ భవనాన్ని తొలగించాలి వివిధ ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్నిర్మించాలని అన్నారు ఈ పాఠశాలలకు కాంపౌండ్ వాల్ లేని కారణంగా విద్యార్థులు విషపూరితమైన కాటుకు గురవుతరని ఆవేదన వ్యక్తం చేశారు ఇట్టి సమస్యలను పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థి సమస్యలు తీర్చకపోతే 2000 మంది విద్యార్థులతో భారీ ధర్నా ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు రానున్న రోజుల్లో జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క పాఠశాల కళాశాలలో ఉన్నటువంటి సమస్యల పైన పోరాటం చేస్తామని తెలిపారు

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

**-ఎంపీడీఓ శ్రీనివాస్ గౌడ్**



పెద్దపల్లి టౌన్ జూన్ 01 అక్షరం న్యూస్

ప్రభుత్వ పాఠశాలల పటిష్టత కు ప్రధానోపాధ్యాయులతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు కలసి సమన్వయముతో పనిచేయాలని పెద్దపల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు పెద్దపల్లి లోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రధానోపాధ్యాయులు పాఠశాల కమిటీ చైర్మన్ల సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఈ నెల 3వ తేదీ నుండి జరుగు బడిబాట కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు పెద్దపల్లి మండల విద్యాధికారి సురేందర్ కుమార్ మాట్లాడుతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫామ్ లు పంపిణికి సిద్దంగా ఉన్నాయని తెలియజేశాడు ఈకార్యక్రమంలో అప్పన్నపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం ఏపీఎం సంపత్ తో పాటు సీఆర్పీలు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్ లు పాల్గొన్నారు.

## హిందూ వాహిని ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ

**ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు**



జ్యోతి నగర్ జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్



ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్లో హనుమాన్ జయంతి ని పురస్కరించుకుని ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీ హిందూ వాహిని ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని గోలివాడ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు మేడిపల్లి సెంటర్లో 300 మందికి మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు ప్రజలందరిపై హనుమాన్ ఆశీస్సులు ఉండి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోలివాడ శ్రీకాంత్, ఈదునూరి బాపూ, చందనగిరి శివకుమార్, తగురం మీన్ను, తాడిపత్రి విష్, కుందరపు పని కీర్తన్, ఉడ్నాల స్వాత్విక్, దగ్గుల లడ్డు, గంగాధర్, విశ్వంత్, తన్నీరు ధనుంజయ్, పోతు సాయి, నరేవుల ధనుష్ తదితరులు పాల్గొన్నారు

# వానాకాలం సీజనల్ సమస్యల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలి**
**-పట్టణాల్లో ఉన్న మేజర్ డ్రైయిన్ డీసిల్టింగ్ పూర్తి చేయాలి**
**-జూన్ 25 నాటికి ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలి**
**-రాబోయే వర్షాకాలం సీజన్ సమస్యల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, ప్రతినిధి జూన్-01 అక్షరం న్యూస్**

రాబోయే వానాకాలంలో మన జిల్లాలో సీజనల్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలం సీజనల్ సమస్యల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,లి రాబోయే వానాకాలంలో వచ్చే సీజనల్ సమస్యల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, రాబోయే విపత్తులను ఎదుర్కునేందుకు మన గ్రామ పంచాయతీ లు, మున్సిపాలిటీలు సన్నద్ధం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో ఉన్న నాలాలను అధికారులు పూర్తిగా పరిశీలించాలని, నాలాలపై జరుగుతున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని కలెక్టర్అధికారులను ఆదేశించారు. నాలాల్లో నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చూడాలని, నాలాలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే చెత్త , పిచ్చి మొక్కలను తొలగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వానాకాలంలో వచ్చే ఆకస్మిక వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని, లోతట్టు ప్రాంతాలను ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాబోయే వానా కాలంలో కురిసే ప్రతివర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టుకునే దిశగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నూతనంగా జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో 5 ఇంకుడు గుంతలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో 100 ఇంకుడు గుంతలు, పెద్దపల్లి మున్సిపాలిటీలో 50 ఇంకుడు గుంతలు, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలలో చెరో 25 ఇంకుడు గుంతల నిర్మాణం జూన్ 25 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయే వానా కాలంలో తెగిపోయే అవకాశం ఉన్న రోడ్లు, కల్వర్ట్ లను గుర్తించి వాటికి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ వైర్లను, ట్రాన్స్ఫార్మర్లను ఒకసారి చెక్ చేసుకోవాలని, ప్రతి గ్రామంలో పట్టణంలో రెస్పాన్స్ టీమ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ చట్టాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో పట్టణాలలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, నాణ్యత ప్రమాణాలు ప్రతి హోటల్లో పాటించే విధంగా పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం కావాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీరు అధికంగా నిలువ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రే చేయాలని, ఆయిల్ బాల్స్ వేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణాల్లో ఉన్న మేజర్ డ్రైయిన్లను డీసెల్టింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా కూలిపోయే, శిథిలావస్థ స్థితిలో ఉన్న భవనాలు, పాతబడిన భవనాలను తొలగించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో రెగ్యులర్ ఫాగింగ్ నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, డి.ఆర్.డి.ఓ. రవీందర్, ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు ఎగ్జామ్ పెట్టే విధానాన్ని వెంటనే రద్దు చేయాలి.

**ఎన్నికల రెమనైజేషన్ వెంటనే చెల్లించాలి.**
**ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుష్ప.**

**నాగర్ కర్నూల్/తెలకపల్లి/జూన్ 1 (అక్షరం న్యూస్)**

ఆశా కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారించాలంటే ఇంకో రుతు శనివారం మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఇంచార్జ్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది . ఆ సందర్భంగా పుష్ప మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు ప్రారంభం నుండి ఇప్పటివరకు అనేక రకాల ట్రైనింగులు పొందారు అందులో భాగంగా రిజిస్టర్స్ రాయడం సర్వేలు చేయడం ఆన్లైన్ చేయడం బిపి షుగర్ థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారు వీటితోపాటు గర్భిని బాలింతలకు చిన్న పిల్లలకు ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ దేశాన్ని పట్టిపీడించిన కరోనా మహమ్మారి నుంచి ప్రజలను కంటికి రెప్పలా కాపాడిన ఆశ వర్కర్లు కీలకపాత్ర పోషించారు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల యొక్క ప్రాణాలను కాపాడిన అనేకమంది ఆశా వర్కర్లు చనిపోతే వారికి కేంద్ర ప్రభుత్వం కనీసం ఎక్స్గ్రేషియా కూడా చెల్లించలేదని ఆయన అన్నారు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూ హెచ్ ఓ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశ వర్కర్లకు అవార్డు అందించారు ఇంత సేవ చేసిన ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకుండా వారి సీనియార్టీని ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఎగ్జామ్ పెట్టడం దుర్మార్గమైన చర్య అని ఆయన అన్నారు గతంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సమ్మె నిర్వహిస్తే ఎన్నికల కోడ్ కారణంగా సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసిన కమిషనర్ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఆశలకు ఎగ్జామ్ పెట్టడం ద్వారా ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్ వల్ల ఆశలకు కలిగే లాభాలు ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ ఏమీ లేవు దీని మూలంగా ఏఎన్ఎం ప్రమోషన్ లాంటి సౌకర్యాలు అందులో లేవు ఆశాల యొక్క జ్ఞాపకశక్తి కొత్తగా నిరూపించుకుంటే ఒక సర్టిఫికెట్



5000 రూపాయలు ఇస్తామని ప్రభుత్వం సర్క్యులర్లో తెలియజేసింది ఆశాల అనేక సంవత్సరాల నుండి కనీస వేతనం ఇవ్వాలని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా కొత్తగా ఎగ్జామ్ రాసి ఉత్తర్వులు అయితే ఐదువేల రూపాయలు బిక్షం వేస్తామనడం అన్యాయం అని ఆయన అన్నారు కావున ప్రభుత్వం తీసుకున్న దుర్మార్గమైన చర్య ఎగ్జామ్ రాసిన వెంటనే రద్దు చేయాలని ఎన్నికల రేమినేషన్ వెంటనే చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్య క్రమంలో మాధవి చంద్రకళ పుష్ప వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# వైభవంగాపాలెం అభయ హనుమాన్ జన్మదిన ఉత్సవాలు.





**నాగర్ కర్నూల్ జూన్ 1 (అక్షరం న్యూస్)**

నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామం వ్యవసాయ కళాశాల ముందున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జన్మదిన ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులువెల్దండ సురేష్ తెలిపారు. పాలెం అగ్రికల్చర్ ప్రధాన రోడ్డు పక్కన గల శ్రీ అభయాంజనేయ స్వామి అత్యంత శక్తివంతుడని, భక్తుల కోరిన కోరికలు శీఘ్రంగా నెరవేర్తాయని భక్తుల నమ్మకమన్నారు. ప్రతి అమావాస్య రోజు విశేషంగా భక్తులు ఇక్కడ నిద్రించడం సంతానం పొందుటకు విశేషంగా భక్తులు వస్తారని తెలిపారు. గ్రహదోష పరిహారము పొంది వివాహం కాని వారు సంతానం కాని వారు ఉన్నత విద్య ,కళ్యాణ ప్రాప్తి కొరకు భక్తులు అమావాస్య రోజులలో అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. ప్రతి ఆదివారం ఆలయ ఆవరణలోని దేవతా వృక్షాలకు తెల్ల జిల్లేడు బిల్వం ఉసిరి వేప జమ్మి రావి చెట్టు వృక్షాలకు ప్రత్యేకంగా అభిషేకాలు పూజలలో అధికంగా భక్తులు పాల్గొంటారని అన్నారు. ఉదయకాలంలో పంచామృత అభిషేకం, తమలపాత్ర ఆకు పూజ, సింధూర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో 21 ఫీట్ల హనుమాన్ విగ్రహం ఉందన్నారు. అనంతరం ఆలయ ఆవరణలోఅష్టోత్తర పూజా,మహిళా భక్తులచే సామూహిక కుంకుమార్చన,స్వామివారికి అభిషేకము సామూహికంగా భక్తులచే నిర్వహించారు. ఆలయ ఆవరణలోపల్లకి సేవ, డోలోత్సవం కార్యక్రమం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పాటు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈయొక్క కార్యక్రమంలో ప్రధాన అర్చకులు విట్టల్, రఘునందన్ రావు, అదేవిధంగా కమిటీ సభ్యులు రామచంద్ర రెడ్డి,డాక్టర్ పి.గోపాల్, గాడి సురేందర్,నాగేష్, మండల పరిషత్ అధ్యక్షులు పుప్పాల శ్రీనివాస్ గౌడ్, గోపాలస్వామి, బండారు జగదీష్ కుమార్,గుంటి వినయ్,దినేష్ బాలకృష్ణ లక్ష్మణ్, మరియు భక్తులు ,మహిళలు,ఈ కార్యక్రమంలోభక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

# భక్తి మార్గం లో నడిచే వారికి ఆంజనేయుడు ఆదర్శం

**- కందుల సంధ్యారాణి**



**జ్యోతి నగర్ జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

శ్రీ రామ బంటు హనుమంతుని జన్మ దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం రామగుండం బీజేపీ ఇంఛార్జి కందుల సంధ్యారాణి నియోజకవర్గం లో వివిధ హనుమాన్ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ శ్రీరాముడి ఆదరాభిమానాలు పొందిన వాడు, సీతమ్మ జాడ కోసం ఎందరో రాక్షసులను వధించి, లంకను కాల్చి, రామసేతు ను నిర్మించి లోక కళ్యాణార్థమై ధర్మం వైపు నిలబడిన రామునికి వెన్నంటే నిలిచిన హనుమంతుడు యుగయుగాలకు ఆదర్శ పురుషుడు. దేశం లో హనుమంతుని గుడి లేని ఊరు లేదు. హనుమంతుని రూపం చిన్నతనం లోనే పసి మనస్కులలో ముద్ర పడిపోతుంది. అలాంటి అంజనేయున్ని ఆదర్శంగా తీసుకుంటే ఎలాంటి విపత్తుని అయినా తట్టుకొని నిలబడే శక్తి వస్తుంది. కొండగట్టు పుణ్యక్షేత్రం దర్శనం వెళ్ళే భక్తులు ఎండకి తగు జాగ్రత్తలు తీసుకొని సంతోషంగా వెళ్లి క్షేమంగా ఇల్లు చేరాలని విన్నవించారు.



# ఎన్టిపిసి అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా పూజలు



**జ్యోతి నగర్ జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

హనుమాన్ జయంతి సందర్భంగా ఎన్టిపిసి పెర్మనెంట్ టౌన్షిప్ లోని అభయాంజనేయ స్వామి ఆలయం లోఉదయం అభిషేకం మన్యు సూక్త హోమం ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులువేముల అనిల్ కుమార్భండారి కనుకయ్యమధు నాగేందర్ దంపతులు హోమంలో కూర్చున్నారు. రుద్రభట్ల ధనంజయ శర్మ నేతృత్వంలో ఆలయ పూజారి రుద్రభట్ల శ్రీకాంత్ శర్మరుద్రభట్ల సంతోష్ శర్మసతీష్ శర్మమారుపాక శ్రీకాంత శర్మ హోమ క్రతువును నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి



**జ్యోతి నగర్ జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

శ్రీ భక్త ఆంజనేయస్వామి దేవాలయం టీ టీ ఎస్, ఎన్ టీ పి సి హనుమాన్ జయంతి ఉత్సవం శనివారం కన్నుల పండుగ గా జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు, శ్రీ హనుమాన్ చాలీసా 11సార్లు, సుందరకాండ పారాయణం, అన్నప్రసాద కార్యక్రమాలు జరిగాయి. ఆలయ పూజారి,గోపినాథ్ స్వామి, శ్రవణ్ కుమార్, పవన్ స్వామి, ఆచార్య అనిరుద్ పూజలు నిర్యహించారు ఆలయ కమిటీ రామచందరగౌడ్, కిషన్ రావు, సురేందర్, లింగారెడ్డి, రంగారావు, కె ఎస్ ఎన్ రావు, కిషన్ రావు, రాజవీర్ పాల్గొన్నారు.

# నివాళులు అర్పించిన అంజన్న



**మహబూబాబాద్ బ్యూరో అక్షరం న్యూస్ జూన్ 1**

కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజన్న నివాళులర్పించారు. భారాస సీనియర్ నాయకులు కేఎస్ ఎన్ రెడ్డి మాతృమూర్తి కోడూరి రంగనాయకమ్మ దశ దినకర్మ జిల్లా కేంద్రంలోని పి ఎస్ ఆర్ కన్వెన్షన్ లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజన్న రంగనాయకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోనగిరి గిరిధర్ గుప్త, మొగిలి ప్రసాద్,సింగం మనోహర్, రవి తదితరులు ఉన్నారు.

# పకడ్బందీగా ఆన్ లైన్ లో కౌంటింగ్ వివరాల నమోదు

**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్**

**లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ వివరాలు ఎన్ కోర్ లో నమోదు ప్రక్రియను వివరించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, ప్రతినిధి జూన్ -01 అక్షరం న్యూస్**

పకడ్బందీగా ఆన్ లైన్ ఎన్ కోర్ వెబ్ సైట్ లో కౌంటింగ్ వివరాలను నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆన్ లైన్ ఎన్ కోర్ వెబ్ సైట్ లో కౌంటింగ్ వివరాలనమోదు ప్రక్రియ గురించి సంబంధిత కౌంటింగ్ ఆపరేటర్లతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,లి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఫలితాలు సకాలంలో ఆన్ లైన్ లో నమోదు చేసేందుకు భారత ఎన్నికల కమీషన్ ఎన్ కోర్ వెబ్ సైట్ వ్యవస్థ ప్రవేశ పెట్టిందని అన్నారు. కౌంటింగ్ నాడు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 14 టేబుల్స్ వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేసేందుకు నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లను నియమిస్తామని, సి1 ఆపరేటర్ కు టేబుల్ సంఖ్య 1,2,3,4 , సి 2 ఆపరేటర్ టేబుల్ సంఖ్య 5,6,7, సి3 ఆపరేటర్ కు టేబుల్ సంఖ్య 8,9,10,11, సి 4 ఆపరేటర్ కు టేబుల్ సంఖ్య 12,13,14 టేబుల్స్ కేటాయించడం జరుగుతుందని, ప్రతి రౌండ్ కౌంటింగ్ సమయంలో సంబంధిత టేబుల్ లో పోలింగ్ కేంద్రాల నుండి వచ్చిన ఫలితాలు ఆయా ఆపరేటర్లు మాత్రమే ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి టేబుల్ కౌంటింగ్ వివరాలు సదరు ఆపరేటర్లకు వచ్చేందుకు , ఆపరేటర్ల వారీగా కలర్ సిస్టం ఏర్పాటు చేశామని, సి1 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది రెడ్ కలర్, సి 2 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది గ్రీన్ కలర్, సి 3 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది బ్లూ కలర్, సి 4 ఆపరేటర్ పరిధిలో సిబ్బంది యెల్లో కలర్ షర్ట్స్ ధరించడం జరుగుతుందని అన్నారు. ప్రతి టేబుల్ వివరాలు నమోదు చేసిన తర్వాత సదరు రౌండ్ ఫలితాలను ఫ్రీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏ రౌండ్ లో ఏదైనా పొరపాటు జరిగినట్లు గుర్తిస్తె సదరు రౌండ్ ఫలితాల ఫ్రీజ్ తొలగించి, కౌంటింగ్ వివరాలను సరి చేయాలనీ, తదుపరి రౌండ్ ఫలితాలు ఆటోమేటిక్ గా క్యారీ ఫార్వర్డ్ అవుతాయని అన్నారు. ఈవిఎం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను నమోదు అనంతరం రిటర్నింగ్ అధికారి కౌంటింగ్ పరిశీలకులతో కలిసి పరిశీలించి తుది ఎన్నికల ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బతో చనిపోయి. ఇద్దరికి చూపునిచ్చిన యువకుడు..!

- మృతుని నేత్రాలు దానం చేసిన కుటుంబం
- అవగాహన కల్పించిన తెలంగాణ రాష్ట్ర ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి
- సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ

**జ్యోతి నగర్ జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

పెద్దపల్లి జిల్లాలో వడదెబ్బతో ఓ యువకుడు చనిపోగా, పుట్టెడు దుఃఖంలోనూ ఆయన కుటుంబ సభ్యులు ఉదారత చాటుకున్నారు. ఆయన కండ్లు దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు.
ఎన్టీపీసీలోని అన్నపూర్ణ కాలనీకి చెందిన ఈదునూరి కిషోర్(37), శుక్రవారం కొండగట్టు దేవస్థానంకు వెళ్లడం కోసం హనుమాన్ మాలధారణ భక్తులతో కలిసి కాలి నడకతో బయలుదేరారు. ధర్మారం మండలం రాజారాం పల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎండదెబ్బతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే గోదావరిఖనిలోని జీజీహెచ్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. కిషోర్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు.

– నేత్రదానంపై అవగాహన కల్పించిన తెలంగాణ రాష్ట్ర ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి...
కిషోర్ నేత్రాలను దానం చేస్తే, మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాధించవచ్చని కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. కొంకటి లక్ష్మీనారాయణ మృతునికి దగ్గరి బంధువు కావడంతో, మృతుని తల్లిదండ్రులు ఉమ్మయ్య, శంకరమ్మ, సోదరులు అశోక్, కిరణ్, సోదరి లలిత, బావ శంకర్ వెంటనే కిషోర్ నేత్రాలను దానం చేయడానికి అంగీకారం తెలిపారు.

– సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ..
తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ ద్వారా సమాచారం తెలుసుకున్న సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి సూచనతో, శనివారం ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ నరేందర్ సహకారంతో ఫౌండేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, ప్రతినిధి అనుమాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు.



– నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చందర్..
కిషోర్ పార్థివ దేహానికి రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తోపాటు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి తదితరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

– అభినందించిన సదాశయ ప్రతినిధులు..
కిషోర్ ను కోల్పోయిన పుట్టెడు బాధలో ఉన్న కుటుంబ సభ్యులు, ఇద్దరికి చూపును ఇవ్వడానికి కిషోర్ నేత్రాలను దానం చేసి స్ఫూర్తిగా నిలిచారని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణా రెడ్డి, సలహాదారులు నూక రమేష్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, పట్టణ అధ్యక్షురాలు అన్నపూర్ణ, కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, శశికళ, శారద, దేవి లక్ష్మీనారాయణ, అనుమాల లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

## అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ యాదవ్







**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 01 / అక్షరం న్యూస్ :**
నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఘనంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమాత దేవాలయం లో అభిషేకం 108 కళాశా పూజ, హెూమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వట్టినావులపల్లి మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కాంక్షిస్తున్నట్లు వివరించారు.

## హనుమాన్ ఆలయంలో కర్ర వెంకటేశ్వర్ దంపతుల ప్రత్యేక పూజ



**కోహెడ/సిద్దిపేట,జూన్ 01(అక్షరం న్యూస్)**
హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కోహెడ మండలం శనిగరం గ్రామంలో కర్ర వెంకటేశ్వర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు స్వామి వంశీ, పాల్గొన్న కర్ర రవీందర్ కర్ర మనోహర్, బుడుగు నర్సయ్య, దొమ్మట కనక రెడ్డి, బుడుగు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి పై ప్రాథమిక విచారణ





**శంకరపట్నం/ కరీంనగర్/జూన్ 1 (అక్షరం న్యూస్ )**
శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిపై కవ్వ రమ్య-రాజిరెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం హుజురాబాద్ డిఎల్పిఓ పాత శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి పై ప్రాథమిక విచారణ జరిగింది.పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేసి డిఎల్పిఓ శ్రీనివాస్ ఉన్నత అధికారులకు నివేదిక అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భర్త అంతం రాజిరెడ్డి గత మూడు నెలలుగా గ్రామంలో విద్యుత్ దీపాలు,డ్రైనేజీ వ్యవస్థ పై టిఎల్పిఓ శ్రీనివాస్ కు వినతి పత్రం అందించారు.డిఎల్పిఓ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ ఆర్అండ్డబ్ల్యుఎస్ మొగిలి,ఎంపీఓ బాషీరుద్దీన్ తో కలిసి గ్రామంలో పలు వార్డులను సందర్శించారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముస్తాబైన ప్రభుత్వ కార్యాలయాలు





**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం /జూన్.01/ అక్షరం న్యూస్**
తెలంగాణ అవతరణ దినోత్సవం అనేది తెలంగాణ రాష్ట్ర అవతరణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ పండుగ. ఈ రోజున రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అవతరణ ఉత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రియాంక అల సూచనల మేరకు జిల్లాలోని అన్ని కార్యాలయాలకు విద్యుత్తు కాంతులతో అంగరంగ వైభవంగా పండుగ వాతావరణాన్ని తలపించేలా విద్యుత్ కాంతులతో అలంకరణ చేసి కార్యాలయాలను ముస్తాబు చేశారు.



## కాంగ్రెస్ పార్టీ నాయకులకు సన్మానం



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 01 / అక్షరం న్యూస్ :**
నార్సింగి మున్సిపాలిటీ నూతన చైర్మన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మెన్ విజయ్‌బాబులు ఎన్నిక కావడంతో శనివారం పలువురు కాంగ్రెస్ నాయకులను కోకాపేట్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అందులో భాగంగా టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అశోక్ యాదవ్, కౌన్సిలర్లు దుర్గేష్ యాదవ్, అమరేందర్ రెడ్డి, శివారెడ్డి, పత్తి ప్రవీణ్, గండిపేట మాజీ సర్పంచ్ గణేష్, యాదగిరిలను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మెన్, వైస్ చైర్మెన్లు మాట్లాడుతూ.. కార్పోరేషన్ అభివృద్ధికి చొరవతో పని చేస్తామన్నారు. అన్ని పనులను దశలవారిగా పూర్తి చేస్తామని వివరించారు.

## శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఖమ్మం పార్లమెంటరీ ఎన్నికల కౌంటింగ్..

### రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్


**ఖమ్మం/ తల్లాడ జూన్ 1 (అక్షరంన్యూస్)**
స్థానిక పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఖమ్మం పార్లమెంటరీ ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4న జరుగుతున్న దృష్ట్యా ఈ నెల 3, 4వ తేదీలో జరగాల్సిన జేఎన్టీయూ చివరి సంవత్సరం సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని ఖమ్మం రూరల్ మండల పరిధిలో గల దరిపెల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కి మార్చినట్లు ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష రాసే స్వర్ణ భారతి ఇంజనీరింగ్ కాలేజ్, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్, బొమ్మ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల యజమాన్యాలు, విద్యార్థులు ఇట్టి విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు. మిగతా పరీక్షలు యధావిధిగా శ్రీ చైతన్య కాలేజీలోనే జరుగుతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అందెశ్రీ ఆది గురువు సిద్ధప్ప వరకవి

**కోహెడ/సిద్దిపేట,జూన్ 01(అక్షరం న్యూస్)**
తెలంగాణ ప్రభుత్వ అధికారిక గేయంగా అందెశ్రీ రాసిన “జయజయహే తెలంగాణ “ ఎంపిక కావడం పట్ల సిద్దప్ప వరకవి కుమారుడు ప్రముఖ కవి అనంతవరం మాణిక్యలింగం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.తెలంగాణ గేయ రచయిత,కవి గాయకుడు డా.అందెశ్రీ తాను సాహితీవేత్తగా, కవిగా ఎదగడానికి,ఈ జ్ఞానం రావడానికి సిద్ధప్ప వరకవి రచనల ప్రభావం తనపై ఉందని పలు సందర్భాల్లో ఉదహరించారని,చిన్నతనంలో పశువుల కాపరిగా పనిచేసినప్పుడు సేదతీరే సమయంలో సిద్ధప్ప వరకవి రాసిన జ్ఞానబోధిని పద్యాల పంక్తులను,అక్షరాలను లెక్కబెట్టుకొని అదే తరహాలో తాను పద్యాలు రాసే ప్రయత్నం చేశానని, అదే స్ఫూర్తితో ఆ దిశగా నేను కవిగా ఎదిగానని స్వయంగా తనతో చెప్పారని ఆయన అన్నారు. సిద్దప్ప వరకవి యోగ విద్యలోను నిష్ణాతులు.తన యోగ దృష్టితో భవిష్యత్తును కూడా అంచనా వేసి తనను ఆశ్చర్యపరిచారని,సిద్దప్పను తాను స్వయంగా సందర్శించిన ఓ సందర్భాన్ని తెలుపుతూ తనతో గల సాన్నిహిత్యాన్ని ఇటీవల ఓ ఛానలుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.ఇప్పటికీ సిద్దప్ప రాసిన పద్యాలను అందెశ్రీ సందర్భోచితంగా పాడుతుంటారు.తెలంగాణ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే గౌరవప్రథమైన “జయజయహే తెలంగాణ”గేయాన్ని రచియించిన అందెశ్రీ తాను కవిగా కీర్తి పొందడానికి సిద్దప్ప వరకవి గురువు కావడం ఆనందంగా ఉందని సిద్దప్ప కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.గుండారెడ్డిపల్లి లోని సిద్దప్ప ఆశ్రమాన్ని పలు సార్లు అందెశ్రీ సందర్శించారని తనతో గల సాన్నిహిత్యాన్ని గుర్తుచేశారు.



## నూతన చైర్మెన్, వైస్ చైర్మెన్‌లకు శుభాకాంక్షలు తెలిపిన మక్త గణేష్‌సింగ్



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / మే 31 / అక్షరం న్యూస్ :**
నార్సింగి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబులకు వట్టినాగుల పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మక్త గణేష్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. తొందరలోనే శంషాబాద్ మున్సిపాలిటీని సైతం కైవసం చేసుకుంటామన్నారు. నిరుపేదల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులైతున్నారన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో, అభివృద్ధిలో, సంక్షేమంలో ఎప్పుడూ ముందుంటుందన్నారు.

## సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి : కమిషనర్ శరత్‌చంద్ర



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 01 / అక్షరం న్యూస్ :**
బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో సానిటేషన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. శనివారం ఉదయం టిప్పు ఖాన్ బ్రిడ్జి నుంచి టీఎస్‌పీఏ జంక్షన్ వరకు పాదచారులకు, వాహనదారులకు శానిటేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని క్లీనింగ్ చేయించారు. సానిటేషన్ డ్రైవ్‌లో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సానిటేషన్‌ను కార్పోరేషన్‌లో పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సైతం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సురేష్, మల్లేష్, యాదగిరి, వెంకటేష్, కృష్ణ, నవీన్, రామాంజులు, జగన్, డ్రైవర్లు, స్వీపర్లు పాల్గొన్నారు.



# అమరుల త్యాగఫలం తెలంగాణ రాష్ట్రం

ఐలయ్య యాదవ్



**ఓదెల/ పెద్దపల్లి జూన్ 01 (అక్షరం న్యూస్ )**

ఓదెల మండలం కొలనూర్ రైల్వే గేట్ వద్ద తెలంగాణా అమరవీరులకు కొవ్వత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థుల , అమరుల త్యాగాల ఫలితమే ఈ రాష్ట్రం అని వారి త్యాగాలు మరువలేనివి , రేపు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వారిని స్మరిస్తూ అమరవీరుల ఆత్మబలిదానాలు , ఉద్యమకారుల అనితర త్యాగాల వల్ల రాష్ట్రం వచ్చిందన్నారు...ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఉద్యమకారునికి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారుకొట్లాడి సాధించుకున్న తెలంగాణరాష్ట్రంలోరాష్ట్ర రావడం కోసం అమరులైన వారికి కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది అని అన్నారు...

ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు జనగాం రవి , జంగం కొమరయ్య , మోహన్ రెడ్డి , బందారి చంద్రయ్య , అమల శంకర్ , కిరణ్ , కొమురయ్య , ఆసరి వెంకటేశం , బందారి సదయ్య , తుంగని అశోక్ తదితరులు పాల్గొన్నారు...

# టిపిఎస్ఎస్ సంస్థ బృందానికి కృతజ్ఞతలు

## సిద్దిపేట జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం



**కోహెడ/సిద్దిపేట,జూన్ 01(అక్షరం న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్ చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎంతోమంది నిరుపేద పూసల కుటుంబాలకు కొండంత అండగా ఉంటూ ఆర్థిక చేయూత అందిస్తూ నిరుపేదల గుండెల్లో మనోధైర్యాన్ని నింపుతున్న టి పి ఎస్ ఎస్ సంస్థ ప్రతినిధుల బృందానికి సిద్దిపేట జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం కృతజ్ఞతలు తెలిపారు.సిద్దిపేట జిల్లా కోహెడ మండలకేంద్రానికి చెందిన చేని లావణ్య-రమేష్ కు అనారోగ్యానికి గురైన ఆమెకు రెండు శస్త్ర చికిత్సలు జరిగి లక్షల్లో ఖర్చు అయిన ఆమె గురించి టి పి ఎస్ ఎస్ సంస్థ సభ్యులు లక్కిరాజుల సుబుద్ధి, పైడిపల్లి బాలయ్య, చేని వేంకటేశం, పొదిల సుదర్శన్ గంగరాం,గుంటిపల్లి సమ్మయ్య గార్లకు తెలియజేయడంతో తెలంగాణ పూసల సంక్షేమ సమితి టి పి ఎస్ ఎస్ సంస్థ నుండి 8000రూ"లను ఈరోజున అందించడంతో వాటితో పాటుగా కోహెడ మండల పూసల సంక్షేమ సంఘం సహాయనిధి నుండి 5000/-రూ"లను కలుపుకొని

మొత్తం 13000/-రూ"లను కోహెడ మండల కేంద్రానికి చెందిన చేని లావణ్య-రమేష్ కుటుంబానికి పూసల సంఘం సభ్యులతో కలిసి సంఘం అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు చేని తిరుపతి, ప్రధానకార్యదర్శి ఖమ్మం తిరుపతి, కోశాధికారి సుంకరి రవి, సంఘం సభ్యులు ఖమ్మం సత్యనారాయణ, రమేష్, సతీష్, పొదిల ఆంజనేయులు, చేని దుర్గేశం, సంపత్, ముద్రకోల లింగం, రమేష్, రాజు,సంతు, గుంటిపల్లి సుధాకర్, ఖమ్మం రాజు, నరేష్, శ్రీనివాస్, జయరాం, సాంబశివ, కుమార్, వెంకటేష్, పట్టేం రాజు, సంపత్, కోనేటి రమేష్, సతీష్,తుపాకుల నర్సయ్య, లక్ష్మణ్, రవి, సాగర్, నరేష్, సుంకరి వేంకటేశం, తదితరులున్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 01 / అక్షరం న్యూస్ :**

శ్రీ భక్త వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలకు శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి కిరణ్ గౌరగారి, సన్నీ చినోల, సుజీత్, హరికిరణ్ గౌడ్, చారి, నీరాజన్, శివ తదితరులు పాల్గొన్నారు.

# భవానీకాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ : బీజేఎంసీ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 01 / అక్షరం న్యూస్ :**

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ఎనిమిదవ డివిజన్ భవాని కాలనీలో కాలనీ అసోసియేషన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మేయర్ ను వారు సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యల గురించి మేయర్, స్థానిక కార్పొరేటర్ లకు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.



# హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి



**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 01 / అక్షరం న్యూస్ :**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బుద్వేల్ లోని గ్రీన్ సిటీ ప్రాంతంలో పురాతన దేవాలయం శ్రీ వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రజలందరికీ హనుమాన్ జయంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు, స్థానికులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హనుమాన్ స్వాములకు పండ్లు పంపిణీ



**కరీంనగర్ తిమ్మాపూర్ జూన్ 01 (అక్షరం న్యూస్)**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూరు లో శనివారం హనుమాన్ జయంతి పురస్కరించుకుని హనుమాన్ మాల ధరించి గత నెల పదిరోజుల నుండి ధీక్ష చేపట్టిన స్వాములు దూరప్రాంతాల నుండి మాల విరమణకు నాలుగు రోజులుగా రహదారి గుండా కాలినడక ద్వారా కొండగట్టుకు వెళుతుండగా అల్గునూరు చౌరస్తా వద్ద ముంజ స్వాతి - శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వాములకు పండ్లు, మజ్జిగ మంచి నీళ్లను పంపిణీ చేశారు.కార్యక్రమాన్ని చూసి సంతోషం వ్యక్తం చేస్తూ హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు మాట్లాడుతూ%8%.. రాష్ట్ర నలుమూలల నుండి ఆంజనేయ స్వామిని అభిమానించి ఆరాధించే వాళ్ళు ప్రతీ ఏడాదికొక సారి వచ్చే హనుమాన్ జయంతికి జయంతి కంటే నెల పదిహేను రోజుల ముందే మాల ధరించి ఉపవాస దీక్ష చేపట్టి జయంతి వరకు ఆంజనేయ స్వామిని ఆరాదిస్తారని, ధీక్ష చేపట్టిన స్వాములు వారు మొక్కుకున్న తీరు కొందరు వాహనాల్లో, కొందరు కాలినడకన స్వామివారి దేవస్థానమైన కొండగట్టుకు వెళ్ళి మాల విరమణ చేసి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.అయితే దూరప్రాంతాల నుండి కాలినడకన స్వామివారిని చెంతకు చెరుకుంటానని మొక్కుకున్న స్వాములు రహదారి గుండా ఎండలో ఆంజనేయ నామస్మరణ చేస్తూ స్వామి వారిని చేరుకుంటారని, మామూలు భక్తులు దారిలో వెళ్ళే స్వాములకు పండ్లు, మజ్జిగ నీళ్లు పంపిణీ చేయడం అనేది ఒక పుణ్య కార్యమని ఇలాంటి దాతలకు భగవంతుడు ముక్తి ప్రసాదిస్తాడని తెలుపుతూ అక్కడ ఉన్న వారికి హనుమాన్ నామస్మరణతో ఆశీర్వదించి కొండగట్టుకు పయనమయ్యారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష స్వాములు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగంరాయపాలెం గ్రామంలో ఘనంగా హనుమాన్ జయంతి..

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలు ఆంజనేయ భక్తుడు..

**ఖమ్మం/ వైరా జూన్ 1 ( అక్షరంన్యూస్)**

ఖమ్మం జిల్లాకొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామంలో అతి పురాతన దక్షిణముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు దంపతులు నూతన వస్త్రధారాలు ధరించి పీటల మీద కూర్చుని భక్తిశ్రద్ధతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... అనంతరం జరిగిన మహా అన్నదాన. .పూజా కార్యక్రమంలో భారీగా మహిళా భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి గ్రామంలో వెలసిన అతి పురాతన హనుమాన్ విగ్రహానికి నేటి వరకు ఆలయం లేదని.గ్రామస్తులు తెలిపారు.దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని గుడి నిర్మాణానికి గ్రామస్తులు కూడా సహకరించాలని కోరారు. వందల ఏళ్ల చరిత్ర కలిగి. కోరిన కోరికలు తీర్చే అంజనీ పుత్రుడు వీరాంజనేయుడు దేవాలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





# ప్రశాంత్‌నగర్‌లో నిర్వహించిన హోమం కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ లతా ప్రేమ్‌గౌడ్





**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 01 / అక్షరం న్యూస్ :**

శ్రీ విజయలక్ష్మి గణపతి ఆలయం ప్రశాంత్ నగర్ కాలనీలో 108 మంది దంపతులచే హోమ కార్యక్రమాలను హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ హాజరై దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లతా ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాక్షించారు.

# చందమ్మకు నివాళులర్పించిన మారెళ్ళ మల్లికార్జున్ రావు, తాళ్ల జోసెఫ్..



**ఖమ్మం/ తల్లాడ జూన్ 1 (అక్షరంన్యూస్)**



తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన అంగన్ వాడి ఆయా ఇస్నపల్లి చందమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ ఆమె మృత దేహానికి పూలమాలలువేసి నివారణ అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో నాయకులు యల్లంకి వెంకటేశ్వరరావు, రామయ్య, ఇశ్నపల్లి వెంకటయ్య, జి. వెంకటరత్నం, ఇస్నపల్లి హనుమయ్య తదితరులు ఉన్నారు.

# కొండగట్టులో హనుమజ్జయంతి

## రామనామస్మరణతో మార్మోగిన క్షేత్రం

## హనుమత్ భక్తుల రాకతో కిటకిటలాడిన ఆలయం

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ యాస్మిన్ భాషా

జగిత్యాల,జూన్1: జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న ఆలయంలో హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆంజనేయస్వామి క్షేత్రం రామనామ జపంతో మారుమోగుతోంది. దీక్షా విరమణ చేసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కాషాయమయంగా మారిపోయాయి. పెద్ద హనుమాన్ జయంతి నేపథ్యంలో మాలదారులు, భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శుక్రవారం సాయంత్రం నుంచి హనుమాన్ మాలధారులు విరమణ కోసం క్షేత్రానికి వేల సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కూడా వేల సంఖ్యలో నిరీక్షిస్తూ ఉన్నారు. వారి భజనలతో క్షేత్రం శ్రీరామ నామస్మరణతో మారుమోగింది. జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషా రాత్రివేళ ఆలయానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం అంజన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఈ ఉత్సవాలు ప్రారంభం అయినప్పటి నుంచి భక్తులు దీక్ష విరమణ కోసం భారీగా తరలివచ్చారు. ఇప్పటికే ఆలయానికి చేరుకున్న వారు అంజన్నను దర్శించుకుని, దీక్షను విరమిస్తున్నారు. అధికార యంత్రాంగం అంతా ఇక్కడే ఉండి ఉత్సవాల నిర్వహణ చూస్తున్నారని, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్య నిర్వాహణపై దృష్టి పెడుతునట్లు పేర్కొన్నారు. కోనేరులో నీళ్లను ఎప్పటికప్పుడూ మార్చుతున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో 650 మంది పోలీసులతో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కొండపైకి చేరుకునేలా నాలుగు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం వరకు దీక్షాపరుల రద్దీ కొనసాగుందని అధికారులు తెలిపారు.



# రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ

## ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ఆంక్షలు
## నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జూన్1: రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్ పై శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2 రాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నె÷-లకెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి నె÷-లకెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను నల్లగుట్ట వైపు నకు పంపుతారు. పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపునుంచి వచ్చేవాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపునుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ÷÷-లఓల్గ÷వర్ మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపున కు పంపుతారు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపునుంచి వచ్చేవాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్‌రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరాపార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్ హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు. సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్రభారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. నాంపల్లి టి జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపునకు పంపుతారు. రవీంద్రభారతి, ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఉండే అవకాశముంది. బేగంపేట వైపునుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చేవాహనాలను సీటీఓ, టివోలీ, వైఎంసీఏ, సంగీత్ క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. బేగంపేట నుంచి కార్ఖానా వైపునకు వెళ్లే వాహనాలను పాట్నీ, వైఎంసీఏ వైపునకు మళ్లిస్తారు. ఆర్‌పీ రోడ్ వైపునుంచి తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, క్లాక్ టవర్, వైఎంసీఏ వైపు పంపుతారు. సంగీత్ నుంచి బేగంపేట వైపునకు వచ్చేవాహనాలను క్లాక్ టవర్, ప్యారడైజ్ మీదుగా రసూల్‌పురా దారికి పంపుతారు. ఆలుగడ్డబావి వైపు నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి వైపు వెళ్లేవాహనాలను సీటీఓ, రాణిగంజ్ వైపునకు పంపుతారు. బోయిపల్లి వైపు నుంచి తివోలీ వైపు వచ్చే వాహనాలను సీటీఓ వైపునకు పంపుతారు. కార్ఖానా, జేబీఎస్, తిరుమలగిరి వైపు నుంచి ప్యాట్నీ వైపునకు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, క్లాక్‌టవర్ వైపునకు పంపుతారు. తివోలి క్రాస్‌రోడ్స్, ఎ÷-లాజా క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే దారిని మూసివేస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారు లు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ మార్గా ల్లో ప్రయాణించి రద్దీని నివారించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

# జానా, కెకెలతో పొన్నం భేటీ

## ఉద్యమం నాటి సంగతులపై చర్చ





హైదరాబాద్,జూన్1: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డితో పాటు కేశవరావుతో మంత్రి పొన్నం ప్రభాకర్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, మాజీ ఎంపీ రాజయ్య ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో నాటి పోరాటాలను జానారెడ్డి , కేశవరావుతో కలిసి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. ఉదయం, సాయంత్రం రెండు పూటలా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం పరేడ్ గ్రౌండ్ లో.. సాయంత్రం ట్యాంక్ బండ్ పై వేడుకలు జరగనున్నాయి. ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా సోనియా గాంధీ రానున్నారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మరో వైపు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

# హైదరాబాద్ పరిధి ఓట్ల లెక్కింపునకు ఏర్పట్లు

## హైదరాబాద్, సికింద్రబాద్ పరిధిలో 16 కౌంటింగ్ కేంద్రాలు
## కౌంటింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు
## కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్లు17 రౌండ్లలో లెక్కింపు
## కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు
## నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్



హైదరాబాద్,జూన్1: లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ కోసం హైదరాబాద్ జిల్లా పరిధిలో అన్ని సిద్ధం చేశామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ తెలిపారు. హైదరాబాద్ , సికింద్రబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 16 కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదని తెలిపారు.

హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని రొనాల్డ్ రాస్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో 20 టేబుళ్లు, యాకుత్‌పురాలో 24 రౌండ్లలో, చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఇక కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్లను 17 రౌండ్లలో లెక్కిస్తామని చెప్పారు. ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు వీవీ ప్యాట్ల స్లిప్పులను లెక్కిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అబ్జర్వర్ ఉంటారని చెప్పారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్‌కోర్‌లో డేటా నమోదుచేస్తారన్నారు. కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని 8 గంటల కంటే ముందు పార్టీల ఏజెంట్ల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ లు ఓపెన్ చేస్తామని వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నాంపల్లి, సికింద్రాబాద్, ఉస్మానియా యూనివర్సిటీలలో ఏర్పాటు చేశామని అన్నారు. అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో 14 టేబుల్స్ ఉంటే జూబ్లీహిల్స్ లో మాత్రం 20 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. తొలిఫలితం చార్మినార్ వచ్చే అవకాశం ఉందని మధ్యాహ్నం మూడు గంటల వరకు పూర్తి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ కు 17 రౌండ్లు ఉంటాయని 12వందల మంది సిబ్బందిని కేవలం కౌంటింగ్ కు వాడుతున్నామని చెప్పారు. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌కు అబ్జర్వర్లు ఉంటారని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని రొనాల్డ్‌రాస్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అబ్జర్వర్ ఉంటారని తెలిపారు.ప్రతి కౌంటింగ్ కేంద్రంలో మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.హైదరాబాద్‌లోని 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుంది. 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుంది. ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశాం. జూబ్లీహిల్స్‌లో అత్యధికంగా 20 టేబుళ్లు ఉంటాయి. యాకుత్‌పురాలో అత్యధికంగా 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్లలో, కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో జరుగుతుంది. ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుంది. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 5 వీవీ ప్యాట్ల స్లిప్పులు లెక్కిస్తామని రొనాల్డ్‌రాస్ తెలిపారు.

# ఉద్యమ ఆకాంక్షల మేరకు అడుగులు వేయాలి !



తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి కావస్తోంది. కానీ ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్ధతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షించుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ధి చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగుతోంది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. తాజాగా గొర్రెల స్కామ్‌లో 700 కోట్లు అక్రమాలు జరిగినట్లుగా గుర్తించారు. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టడం, చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోయడం, మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయడం, హరితహారంతో పచ్చదనాన్ని పెంచి మొక్కల పెంపక ప్రాధాన్యాన్ని గుర్తించేలా చేయడం వంటి అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో విస్తుపోవాల్సి వస్తోంది. గణనీయమైన మార్పులు చూపి..ప్రజలకు ఆదర్శ నేతగా నిలిచే సత్తా ఉన్నప్పటికీ కేవలం కెసిఆర్‌కు తన కుటుంబం, తన స్వార్థ రాజకీయాలు మాత్రమే ఉన్నాయనడంలో సందేహం లేదు. ఓ రకంగగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేడని అంతా భ్రమించారు. కరిమింగిన వెలగపండులా ఆయన విజినరీ అంతా లోపాలమయం అని తేలింది. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి కూడా లేదు. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాలతో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. దేశానికి దిక్సూచి అనేలా ముందుకు సాగాల్సిన అవకాశాలు ఉన్నాయి. కేసీఆర్ తొమ్మిదినరేళ్లుగా అనేక విజయాలు సాధించామని చెప్పుకున్నారు. రాష్ట్ర ఏర్పాటుకు పోరాడడం ఒక ఎత్తయితే, సుస్థిరాభివృద్ధికి సుపరిపాలన ఎంతో అవసరం. అందుకే తాను నమ్ముకున్న బాటలో సాగడానికి ఆయన విమర్శలను పక్కన పెట్టారు. స్వప్రయోజనాలకు పెద్దపీట వేశారు. ఈ క్రమంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆర్భాటాలకు పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్దిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ధి చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం దశాబ్ది ఉత్సవాల వేళ..ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉంది. ఉద్యమ కాలం నాటి ఆకాంక్షలు నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ పూర్తిగా విఫలమైంది. బిఆర్‌ఎస్ ఓటమితోనే తెలంగాణకు విముక్తి అనే నినాదంతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, గత పదేండ్ల పాలనకు భిన్నంగా తెలంగాణను పునర్ నిర్మిస్తామన్న హామీ మేరకు ముందుకు సాగాలి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తీసుకున్న చర్యలను బట్టి, ప్రజాస్వామ్యంలో రాచరికపు పోకడలను వ్యతిరేకించే తెలంగాణ సమాజం ప్రభుత్వ చర్యను స్వాగతించిందనే చెప్పాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులతో పాటు ప్రజా యుద్ధనౌక గద్దర్ లాంటి వారిని ఎందరినో గేటు బయట నిలబెట్టిన ప్రగతిభవన్ కంచెలను కూల్చేయడంతో ప్రభుత్వానికి పెద్దఎత్తున మద్దతు లభించింది. రైతుల భూహక్కులకు విఘాతం కలిగిస్తున్న 'ధరణి పోర్టల్'ను రద్దు చేయడం, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు తీసుకోవడం ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం పెంచిదనే చెప్పాలి. అయితే ఇవన్నీ కేవలం తాత్కాలిక చర్యలు మాత్రమే. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా సాగించాలి. ఉద్యమకారులను స్వాతంత్య్ర సమర యోధులువలె గుర్తించి వారికి రాజకీయ, ఆర్థిక అండదండలు అందిస్తామని చెప్పిన అప్పటి ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలను పక్కన పడేసింది. ఉద్యమకారులపై కేసులను కూడా పూర్తిస్థాయిలో ఎత్తేసే ప్రయత్నం చేయలేకపోయింది. ఇలాంటి పరిస్థితులలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల ఆశలు, ఆకాంక్షలకు ఊపిరి పోస్తూ గట్టి చర్యలకు ఉపక్రమించాలి. దశాబ్ది ఉత్సవాల వేళ..రానున్న ఐదేళ్ల కాలం సాఫీగా సాగుతుందని, ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని చూపాలి.

# దేశంలో మారుతున్న రాజకీయాలు


## ఫలితాల్లో బిఆర్‌ఎస్‌కు సానుకూల ఫలితాలు
## మోడీపై ప్రజలకు తొలగిన భ్రమలు
## నిర్ణయాకశక్తిగా మారనున్న కెసిఆర్
## ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి వెల్లడి



నిజామాబాద్,జూన్1: బిజెపికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయం కేవలం కెసిఆర్‌తో సాధ్యమని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ముందే గుర్తించి కేంద్రంలో మోడీకి ప్రత్యామ్నాయం కావాలని కోరుకున్న మొదటి నాయకుడు కెసిఆర్ అని గుర్తు చేశారు. ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన తీసుకుని వచ్చిన మొదటి నేత కూడా కెసిఆర్ అన్నారు. నిజానికి ఆనాడు కెసిఆర్ ప్రతిపాదనపై ఓ అడుగు ముందుకు వేసివుంటే ఇవాళ ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. గతకొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచార సరళి, జాతీయ రాజకీయాల్లో వస్తున్న మార్పులు చూస్తుంటే కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో కలీలక భూమిక పోషించినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదన్నారు. ఈ విషయంలో కెసిఆర్ ఆలోచన చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాల తరవాత కేంద్రంలో జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని అన్నారు. కాంగ్రెస్, బిజెపిలు సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే స్థితిలో లేవని అన్నారు. బిఆర్‌ఎస్ జాతీయ రాజకీయాల్లో బాణంలా దూసుకుపోవడం ఖాయమని అన్నారు. సంకీర్ణ రాజకీయాల్లో ఏదైనా సాధ్యం అన్నారు. అయితే ప్రత్యామ్నాయ రాజకీయాలు కేవలం కెసిఆర్‌కు మాత్రమే సాధ్యమని వేముల అన్నారు. ఢిల్లీలో నిర్ణాయక శక్తిగా అవతరించడానికి కెసిఆర్‌కు మాత్రమే అవకాశం ఉందన్నారు. కెసిఆర్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ తరహా అభివృద్ధి చేయాలంటే బిఆర్‌ఎస్ పటిష్టంగా ముందుకు సాగాల్సి ఉందని అన్నారు. ఎన్నికల్లో అతధిక ఎంపి సీట్లను సాధిస్తామన్న విశ్వాసం ఉందని, అందుకే మళ్లీ కెసిఆర్ తన విశ్వరూపం చూపడం ఖాయమని అన్నారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్, బిజెపిల కాలం చెల్లిందని అన్నారు. జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు మోడీపై నమ్మకం పోయిందని, అలాగే కాంగ్రెస్‌ను మరోమారు ప్రజలు నమ్మే స్థితి లేదన్నారు. వివిధ పార్టీల్లో సత్తా కలిగిన నేత ఎవర్న చర్చ వచ్చినప్పుడు అంతా కెసిఆర్ వైపు చూస్తున్నారని అన్నారు. గతంలో తాము వివిధ పార్టీల నాయకులతో మాట్లాడినప్పుడు ఇదే భావన వ్యక్తం అయ్యిందన్నారు. దేశం పట్ల స్పష్టమైన అవగాహన కెసిఆర్‌కు ఉందన్నారు. 75 సంవత్సరాలు దేశాన్ని పాలించిన నాయకులు దేశ అభివృద్ధిని పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో రైతుల పక్షాన నిలబడి నిరుపేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. కెసిఆర్ జాతీయనేతగా ఎదిగితే సమస్యలను పరిష్కరిస్తూ దేశ ప్రగతిని మరింత పెంచవచ్చన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలకు చౌకీదార్, టేకేదార్ అవసరం లేదని ప్రజలకు మెరుగైన పాలన అందించే నాయకులు, ధృడ సంకల్పంతో ఉన్న సైనికుడు కావాలన్నారు. దేశ ప్రధాని మోదీకి ప్రజల సమస్యలపై ఎటువంటి అవగాహన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజల సొమ్ముతో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ వేలాది కోట్ల రూపాయాలు దోచుకున్నారని ఆరోపించారు. దేశావసరాలు, నదుల అనుంధానం, రైతులు, వ్యవసాయ రంగంపై కెసిఆర్‌కు స్పష్టమైన అవగాహన ఉంది. అలాంటి కేసీఆర్ ప్రధానమంత్రి అయితే దేశ ప్రజలు అన్ని విధాలా లబ్ధిపొందుతారని అన్నారు. అదే సమయంలో దేశంలోని అనేక ప్రాంతీయ పార్టీల నేతలు కేసీఆర్ ముందుచూపును స్వాగతించి ఉంటే ఇప్పటికే ఓ రాజకీయాల్లో ఓ మలుపు తిరిగేవని అన్నారు.

# కూర్మవాతారం విశిష్టమైనది

శ్రీకాకుళం,జూన్1: దుష్టశిక్షణ , శిష్టరక్షణ కోసం శ్రీ మహావిష్ణువు దశావతారాలెత్తాడు. అందులో రెండో అవతారం కూర్మావతారం. కృతయుగంలో దేవ , దానవులు అమృతం కోసం క్షీరసాగరం చిలకడం మొదలు పెట్టారు. మంధరగిరిని కవ్వంగా,వాసుకుని తాడుగా చేసుకుని దేవాసురులు పాలసముద్రాన్ని చిలుకుతుండగా మందరగిరి సముద్రంలోకి జారిపోతూ సముద్ర మధనానికి ఆటంకం కలిగింది. ఈ ఆటంకం నుంచి బయటపడేలా అనుగ్రహించమని దేవతలు మహావిష్ణువు వేడుకున్నారు. అప్పుడు నారాయణుడు కూర్మరూపం దాల్చి సముద్రంలోకి మందరగిరిని మునిగిపోకుండా చేశాడు. అలా ఉద్భవించినదే కూర్మావతారం. కూర్మవతారాన్ని కొలిచే ఆలయాలు దేశంలోనే కాదు ప్రపంచంలోనూ చాలా తక్కువ.కానీ ప్రపంచంలోనే ఏకైక కూర్మదేవాలయంగా చెప్పబడుతున్న పుణ్యక్షేత్రం శ్రీకూర్మం. అరుదైన శిల్పకళతో రూపుదిద్దిన ఈ ఆలయం శివకేశవ అబేధాన్ని సూచించే క్షేత్రంగా విరాజిల్లుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని గార మండలంలో శ్రీకాకుళం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వంశధారా నది ఒడ్డున ఈ ఆలయం ఉంది. కళింగరాజైన అనంగభీముడు కూర్మనాథస్వామి ఆలయాన్ని పునర్‌నిర్మించి నట్లు చరిత్ర చెబుతోంది. సుదర్శనచక్రం చేత పుష్కరిణి ఆవిష్కరించబడిందనీ, అందుకే ఈ గుండంలో స్నానం చేస్తే కలిదోషాలు తొలగిపోతాయని చెప్తారు. ఈ గుండంలో స్నానం చేసి ఇక్కడ వున్న విష్ణుపాదాల దగ్గర పిండప్రదానం చేస్తే పితరులకు ఉత్తమ గతులు కలుగుతాయని విశ్వాసం. ప్రతి సంవత్సరం మార్చిలో హోళీ పున్నమినాడు పెద్దఎత్తున ఈ ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయి. వైశాఖ శుద్ధ ఏకాదశినాడు స్వామికి కల్యాణోత్సవం, జ్యేష్ట మాసంలో వచ్చే కూర్మ జయంతి నాడు జరిగే ఉత్సవాల్లో పాల్గొంటే సకల సంతోషాలు చేకూరు తాయని పెద్దల ఉవాచ.



# కుబేరుల జాబితాలో టాప్‌లో అదానీ

## ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా అదానీ
## రెండవ స్థానంలో అంబానీ

న్యూఢిల్లీ,జూన్1: బ్లూమ్ బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచ టాప్ బిలియనీర్ల జాబితాలో మార్పులు చోటుచేసుకున్నాయి. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ.. కుబేరుల జాబితాలో టాప్‌లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీని వెనకకు నెట్టి ప్రథమ స్థానంలో నిలిచారు. గత కొద్ది రోజులుగా స్టాక్ మార్కెట్‌లో ఉన్న అదానీ కంపెనీ షేర్లు భారీగా పెరగడంతో అతడి సంపద పెరిగింది. దీంతో అత్యంత సంపన్నుడిగా అదానీ నిలిచారు. ప్రస్తుతం అదానీ ప్రపంచ సంపన్నుల జాబితాలో 11వ స్థానానికి చేరారు. అదానీ నికర విలువ 111 బిలియన్ డాలర్లు. ముఖేష్ అంబానీ నికర విలువ 109 బిలియన్ డాలర్లు కాగా ఆయన సంపన్నుల జాబితాలో 12వ స్థానంలో నిలిచిపోయారు. సుప్రీం కోర్టు సానుకూల తీర్పు తర్వాత షేర్ల ధర పెరగడంతో అదానీ సంపద విలువ కూడా భారీగా పెరిగింది. గత 24 గంటల్లోనే అదానీ నికర లాభం 5. 44 బిలియన్ డాలర్లకు పైగా పెరిగింది. అత్యధికంగా 2024 సంవత్సరంలో సంపాదిస్తున్న బిలియనీర్లలో గౌతమ్ అదానీ ఒకరు. అదానీ జనవరి 1 2024 నుంచి ఇప్పటి వరకు 26.8 బిలియన్ డాలర్లు సంపాదించారు. కేవలం ఈ ఏడాది ముఖేష్ అంబానీ సంపద 12.7 బిలియన్ డాలర్లు పెరిగింది. 2023 జనవరిలో హిండెన్ బర్గ్ నివేదిక అనంతరం ఏకంగా 34 వంతు సంపద కోల్పోయారు. అదానీకి చెందిన కంపెనీ షేర్ల విలువ భారీగా పడిపోవడంతో భారత్ తో పాటు ప్రపంచ దేశాల సంపన్నుల జాబితాలో ఆయన చాలా స్థానాలు కోల్పోయారు. దాదాపు 16 నెలల తర్వాత మళ్లీ ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా నిలిచారు. ట్రేడింగ్ చివరి రోజు శుక్రవారం స్టాక్ మార్కెట్ లో అదానీ గ్రూప్ కంపెనీ షేర్లలో 14 శాతం



పెరుగుదల పొందింది. ట్రేడింగ్ మ్నెగిసే సరికి 10 కంపెనీలు లాభాలను ఆర్జించాయి. దీంతో అదానీ పవర్ స్టాక్ భారీ పెరుగుదల నమోదు చేసుకుంది.

# ఎపిలో ఎన్‌డిఎ కూటమిదే అధికారం

## విపక్షానికి పరిమితం కానున్న వైకాపా
## తెలంగాణలో ఎంపి సీట్లను పెంచుకోనున్న కాంగ్రెస్

హైదరాబాద్,జూన్1: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. వివిధ మీడియా హౌస్‌లు, సర్వే సంస్థలు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని క్రోడీకరించి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రాబోతోందో అంచనా వేశాయి. మే 13న జరిగిన ఎన్నికల్లో ఏపీలో ఇంతకుముందెన్నడూ నమోదు కాని విధంగా అత్యధికంగా 82.37శాతం పోలింగ్ నమోదైంది. భారీ పోలింగ్ తగినట్లుగానే ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డాయి. ఏపీలో తెదేపా, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించాయి.

ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 2,387 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 46 మంది పోటీలో ఉండగా.. అనకాపల్లి జిల్లా చోడవరం అసెంబ్లీ నుంచి అత్యల్పంగా ఆరుగురు పోటీ చేశారు. మంగళగిరిలో నారా లోకేశ్ సహా 40 మంది బరిలో ఉన్నారు. కుప్పం నుంచి చంద్రబాబు సహా 13 మంది, పిఠాపురం అసెంబ్లీ బరిలో పవన్ సహా 13 మంది పోటీలో నిలిచారు. పులివెందుల నియోజకవర్గంలో జగన్ సహా 27 మంది పోటీ చేశారు. తెలంగాణలో ఐదు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందో ఏబీపీ – సీ ఓటర్ వంద శాతం ఖచ్చితమైన అంచనాలను వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీ 64 అసెంబ్లీ సీట్లను సాధించబోతోందని బీఆర్ఎస్ పార్టీ 40 లోపు సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసింది. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లోనూ ఎగ్జిట్ పోల్స్ ను ఏబీపీ – సీ ఓటర్ నిర్వహించింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు భిన్నత్వం ఎక్కువగా కనిపిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వేర్వేరుగా జరగడం వల్ల ఓటింగ్ ప్రయారిటీ అంశాలు మారిపోయాయి. అందుకే ఫలితాల్లోనూ భిన్నత్వం కనిపిస్తోంది. తెలంగాణలో ఏబీపీ – సీఓటర్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ అంచనాల్లో మొదట ఓట్ షేర్‌ను పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఏపీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అత్యధికంగా 52.9 శాతం ఓట్లు సాధిస్తుందని ఏబీపీ న్యూస్ – సీ ఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. తర్వాత వైఎస్‌ఆర్‌సీపీకి 41.7 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. అలాగే వైఎస్ షర్మిలా రెడ్డి కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని కొంత మెరుపరిచారు. గత ఎన్నికల్లో ఒక్క శాతం కన్నా తక్కువే ఓట్లు వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ సారి మెరుగైన ఓట్లు సాధించబోతోంది. ఈ సారి 3.3 శాతం ఓట్లు వస్తాయని ఏబీపీ – సీఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. ఇతరులు 2.1 శాతం ఓట్లు సాధించే అవకాశాలు ఉన్నాయి. సీట్ల ప్రకారం చూస్తే.. 52.9 శాతం ఓట్లు సాధిస్తున్న ఎన్డీఏ కూటమి ఆటోమేటిక్ గా స్వీప్ చేయంగా కనిపిస్తోంది. మొత్తం ఇరవై ఐదు లోక్ సభ సీట్లలో 21 నుంచి 25 సీట్లు కూటమి పార్టీలు సాధించే అవకాశాలు ఉన్నాయి. వైఎస్‌ఆర్‌సీకి 0 నుంచి 4 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. అంటే వైఎస్‌ఆర్‌సీపీ ఖచ్చితంగా గెలిచే లోక్ సభ సీటు ఒక్కటి కూడా లేదని ఏబీపీ సీఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. ఎబీపీ – సీఓటర్ ఎగ్జిట్ పోల్ పూర్తిగా లోక్ సభ నియోజకవర్గాలకు సంబంధించినదే. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. ఈ లోక్ సభ సీట్ల నిష్పత్తిలోనే అసెంబ్లీ సీట్లను కూడా.. కూటమి , వైఎస్‌ఆర్‌సీపీ గెలుచుకునే అవకాశాలు ఉంటాయని అంచనా వేసుకోవచ్చు.

# దక్షిణాదిలోనూ బిజెపి సత్తా

## తమిళనాడులో గనీయంగా సీట్ల పెంపు
## కేరళలో ఖాతా తెరవబోతున్నట్లు వెల్లడి
## ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ పెరగనున్న సీట్ల సంఖ్య
## కడపలో షర్మిల ఓటమి ఖాయమంటున్న సర్వేలు

న్యూఢిల్లీ,జూన్1: లోక్‌సభ ఎన్నికల్లో విజయావకాశాలపై ఎగ్జిట్ పోల్ సర్వేలు క్రమంగా వెలువడు తున్నాయి. మెజారిటీ పోల్ సర్వేలు ఎన్డీయే 350కు పైగా సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నాయి. ఆసక్తికరంగా ఈసారి ఎన్నికల్లో దక్షిణాదిలోనూ కమలం పార్టీ 57 నుంచి 65 సీట్ల వరకూ గెలుచుకునే అవకాశాలున్నాయని ఇండియా టీవీ-సీఎన్‌ఎక్స్ ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. 'ఇండియా' కూటమి 59 నుంచి 66 సీట్లు, ఇతరులు 4 నుంచి 7 సీట్లు గెలుచుకుంటాయని పేర్కొంది.ఆంధ్రప్రదేశ్‌లో 25 సీట్లుకు గాను టీడీపీ 13 నుంచి 15 సీట్లు, బీజేపీ 4–6 సీట్లు, జనసేన పార్టీ 2 సీట్లు, వైఎస్‌ఆర్‌సీపీ 3–5 సీట్లు గెలుకుంటుందని వెల్లడించింది. కాంగ్రెస్ ఖాతా కూడా తెరువదని తేలిపోయింది. దీనిని బట్ట కడపలో షర్మిల ఓటమి ఖాయమని తెలుస్తోంది.కర్ణాటక 28 సీట్లలో ఎన్డీయే 20 నుంచి 24 సీట్లు, బీజేపీ 18–22, జేడీఎస్ 1–3, కాంగ్రెస్ 4–8 సీట్లు గెలుచుకుంటాయి. తెలంగాణ 17 సీట్లలో బీజేపీ 8 నుంచి 10, కాంగ్రెస్ 6–8, బీఆర్ఎస్ సున్నా నుంచి ఒకటి, ఏఐఎంఐఎం 1 సీటు గెలుచుకుంటాయని అంచనా వేశారు.

కేరళ 20 సీట్లకు గాను బీజేపీ 1 నుంచి 3 గెలుచుకుని ఖాతా తెరవబోతోంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ 13 నుంచి 15, ఎల్‌డీఎఫ్ 3 నుంచి 5 సీట్లు గెలుచుకుంటాయి. తమిళనాడు 39 సీట్లలో




బీజేపీ 5 నుంచి 7, డీఎంకే 16–18, కాంగ్రెస్ 6–8, ఏఐఏడీఎంకే సున్నా నుంచి ఒకటి, ఇతరులు 8 నుంచి 10 సీట్లు గెలుచుకుంటారు. పుదుచ్చేరి బిజేపీకే దక్కుతుందని అంచనా వేశారు.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై అటకెక్కించే కుట్రలు

## సమగ్ర విచారణ జరగకుండా చేస్తున్నారు
## సరిగ్గా విచారణ జరిగితే కేసీఆర్, కేటీఆర్ జైలుకే
## విచారణ జరగకుండా ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు
## బండి సంజయ్ లేఖ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్,జూన్1: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ లేఖ రాశారు. కాళేశ్వరం మాదిరిగానే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగకుండా అటకెక్కించే కుట్రలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపై విచారణ జరిగితే కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లక తప్పదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరగకుండా ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయని తెలిపారు. భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కారకులు కేసీఆర్, కేటీఆర్ లకు నోటీసులిచ్చి విచారిస్తే రాష్ట్ర దర్యాప్తు సంస్థల విశ్వసనీయత పెరిగేదన్నారు. ఆ పని చేయకపోవడంవల్లే సీబీఐ విచారణ కోరుతున్నామన్నారు. ఫోన్ ట్యాపింగ్ అత్యంత తీవ్రమైన నేరమన్నారు. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రసాదించిన హక్కులను కూడా ఫోన్ ట్యాపింగ్ తో కాలరాశారన్నారు. భార్యాభర్తలు మాట్లాడుకునే అంశాలను కూడా ట్యాపింగ్ చేసి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడ్డారన్నారు. ఫోన్ ట్యాపింగ్ తో వ్యాపారులు, బిల్డర్లు, పారిశ్రామికవేత్తలుసహా పలువురు సెలబ్రిటీలను బెదిరించి డబ్బులు వసూలు చేయడంతోపాటు తమ అవసరాలను తీర్చుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుండి ప్రత్యేకంగా పరికరాలు తెప్పించారన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయాక ఫోన్ ట్యాపింగ్ పరికరాల ధ్వంసం పేరుతో దేశ భద్రతకు, ఉగ్రవాదులకు సంబంధించిన కీలకమైన సమాచార డేటాను కూడా ధ్వంసం చేశారన్నారు. వ్యాపార సంస్థలు ప్రతిపక్షాలకు విరాళాలు ఇవ్వకుండా ఫోన్ ట్యాపింగ్ ను వాడుకున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన సూత్రధారి ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నా ఎందుకు స్వదేశానికి రప్పించలేకపోయారన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలు నిగ్గు తేలాలంటే సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం అనివార్యం అన్నారు. మీరే సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాయండన్నారు. రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రతిపక్షాలపై సైబర్ దాడికి కారకుడైన మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ లకు నోటీసులిచ్చి విచారణ జరిపి చిత్తశుద్ధిని



నిరూపించుకోవాలన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యాంగ హక్కులనే ఉల్లంఘించిన కేసీఆర్ ను, కేటీఆర్ లు ఎమ్మెల్యే పదవులకు అనర్హులు అని తెలిపారు. తెలంగాణ శాసనసభా నాయకుడిగా ఉన్న మీరు కేసీఆర్, కేటీఆర్ లను అనర్హులుగా ప్రకటించే విషయంపై స్పీకర్ కు లేఖ రాయాలన్నారు.

.....



# బిజెపి విషపాములాంటిది: కూనంనేని

గోదావరిఖని,జూన్1: కేసీఆర్ ఓడిపోయి తప్పించుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాషట్‌రాన్ని అడ్డగోలుగా పాలించి అప్‌ఉల్లో ముంచారని మండిపడ్డారు. వీటికి బాధ్యత కెసిఆర్‌దే అన్నారు. గోదావరిఖని ఇల్లందు క్లబ్ లో జరిగిన ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బతికి ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ప్రభుత్వ లోగో పై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరే విధంగా కొత్త ప్రభుత్వం పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఏ రంగం సంతృప్తి కరంగా లేదన్నారు. పదేండ్లలో సింగరేణిని విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు. దేశానికి బీజేపీ అత్యంత ప్రమాదకారి అని, ఆ పార్టీ విషపూరితమైన పాము లాంటిదన్నారు. అధికారం కోసం మోదీ ఎంతటికైనా దిగజారుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపులో కమ్యూనిస్టు పార్టీ భాగస్వామ్యం ఉందన్నారు. డబ్బులతో పని లేని ఎన్నికలు రావాలని కోరుకుంటున్నామని ఆయన చెప్పారు.

# కూలిన నిర్మాణంలో ఉన్న భవనం

## స్లాబ్ కూలడంతో తప్పిన ముప్పు

హైదరాబాద్,జూన్1: నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్ స్లాబ్ కుప్పకూలిన ఘటన రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. జూన్ 1వ తేదీ శనివారం పుప్పాల్ గూడలోని అల్కాపూర్ రోడ్డు నెంబర్ 14లో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. స్లాబ్ వేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎవరకీ ఎటువంటీ గాయాలు కకపోవడంతో తప్పిన పెను ప్రమాదం తప్పింది. బిల్డర్స్ నాసిరకమైన మెటిరియల్ వాడి స్లాబ్ వేస్తుండడంతో జరిగనట్లు తెలుస్తోంది. కుప్పకూలిన స్లాబ్ విడియోలు చిత్రికరించడానికి వెళ్లిన మీడియాపై యాజమాన్యం దాడికి యత్నించింది. ఇక్కడ ఏమీ కాలేదంటూ... ఇరువైపుల రోడ్డును అధికారులు మూసివేశారు. సేఫ్టీ ప్రికాషన్స్ పాటించకుండా కార్మికుల ప్రాణాలతో నిర్మాణ సంస్థలు చెలగాటం ఆడుతున్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

# పివోకె విదేశీ భూభాగం

## ఇస్లామాబాద్ హై కోర్టులో అంగీకరించిన పాక్

ఇస్లామాబాద్,జూన్1: పాక్ ఆక్రమిత కశ్మీర్ విదేశీ భూభాగమని పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్ హై కోర్టులో అంగీకరించింది. అక్కడ పాకిస్థాన్ చట్టాలు చెల్లబోవని చెప్పింది. పాత్రికేయుడి కిడ్నాప్ కేసుపై శుక్రవారం విచారణ సందర్భంగా పాకిస్థాన్ అదనపు అటార్నీ జనరల్ ఇస్లామాబాద్ కోర్టులో ఈమేరకు వ్యాఖ్యానించారు. రావల్పిండిలోని తన ఇంట్లో ఉన్న అహ్మద్ ఫర్హద్ షా అనే పాత్రికేయుడిని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ మే 15న కిడ్నాప్ చేసింది. దీనిపై ఆయన భార్య అక్కడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మోసిన్ అక్తర్ కయాని నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. అహ్మద్ ఫర్హద్‌ను కోర్టు ఎదుట ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అటార్నీ జనరల్.. ప్రస్తుతం అహ్మద్ 'పీవోకే'లో పోలీస్ కస్టడీలో ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. అది విదేశీ భూభాగమని, అక్కడ ప్రత్యేక రాజ్యాంగం, చట్టాలు ఉంటాయని, పాకిస్థాన్ చట్టాలు

చెల్లబోవని చెప్పారు. అందువల్ల అతడిని కోర్టు ఎదుట ప్రవేశపెట్టడం కుదరదని వివరించారు. దీనిపై స్పందించిన జస్టిస్ కయానీ ఒకవేళ పీవోకే విదేశీ భూభాగమైతే.. పాకిస్థాన్ రేంజర్లు, పాక్ మిలటరీ ఎందుకు ఆ ప్రాంతంలోకి చొరబడుతున్నారని చురకలంటించింది. సామన్యులను విచారణ పేరుతో ఇంటెలిజెన్స్ సంస్థలు బలవంతంగా నిర్బంధించడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. మరోవైపు పాక్ న్యాయవాది వ్యాఖ్యలతో భారత్‌కు మరింత బలం చేకూరినట్లయింది. 'పీవోకే' భారత్‌లో అంతర్భాగమని, అది 1947 నుంచి పాక్ ఆక్రమణలో ఉందని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. పీవోకే ఎప్పటికీ భారత్‌తోనే ఉంటుందని, అది భారత్‌లోనే ఉంటుందని వివిధ సందర్భాల్లో ఆయన నొక్కి చెప్పారు.

# ఆందోళన వద్దు.. దేశ ప్రజలంతా మోడీ వైపే..!


## బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుంది
## బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



న్యూఢిల్లీ,జూన్1: ఈ నెల 4 వ తేదీన వెలువడే లోక్ సభ ఎన్నికల ఫలితాలపై ఆందోళన అవసరం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. దేశ ప్రజలందరూ ప్రధాని నరేంద్ర మోడీ వైపే ఉన్నారని చెప్పారు. ఇక, దేశంలో బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని జోస్యం చెప్పుకొచ్చారు. ఎన్డీయే 400 సీట్లకు పైగా గెలుస్తుందనే ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశానికి మోడీ అవసరముందని ప్రజలు గ్రహించారు.. అందుకే, మాకు ఈ సారి భారీ మేజార్టీ రాబోతుందన్నారు. చింద్వారా సీటుతో సహా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో అన్ని స్థానాలను గెలుస్తాం.. రాజస్థాన్ లోనూ మెరుగైన ఫలితాలు వస్తాయని జేపీ నడ్డా వెల్లడించారు.కాగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ధ్యానంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలపై కూడా జేపీ నడ్డా రియాక్ట్ అయ్యారు.. వారికి ఆధ్యాత్మిక విషయాలు పూర్తిగా తెలియవు.. వారు కేవలం పొలిటికల్ టూరిస్టులు మాత్రమేనంటూ మండిపడ్డారు. కేవలం ఎన్నికల టైంలోనే మతపరమైన పర్యటనలు చేస్తారంటూ నడ్డా ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎన్నికలను వర్గీకరించి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదిలోనే బీజేపీ అన్ని రికార్డులను బద్దలు కొడుతుందని విశ్వాసం మాకు ఉందన్నారు. తెలంగాణ. తమిళనాడులో ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది.. ఇక్కడి ప్రజలు మోడీ నాయకత్వంలో కొత్త మార్పులను చూసేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పుకొచ్చారు.

# సోనియా లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు

## కేసీఆర్ కూడా ఆమాట చెప్పారు
## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జూన్1: సోనియా లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు, ఆ విషయాన్ని కేసీఆర్ నిండు సభలో చెప్పారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని స్కీంలలో స్కామ్‌లు జరిగాయని.. గొర్రెల పథకంలో భారీ స్కాం జరిగిందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌తో సహా 12 పార్లమెంట్ స్థానాల్లో గెలుస్తామన్నారు. కాంగ్రెస్ వేవ్‌తో మా నేతలు గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే పదేళు మా ప్రభుత్వమేనన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందన్నారు. ఆగస్టు 15 లోపు 2లక్షల రుణ మాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రీయ గీతంపై కేటీఆర్ మతి భ్రమించి ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. చిహ్నంపై అందరితో చర్చించి నిర్ణయం ఉంటుందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో అందరు రావులే ఉన్నారని ఆరోపించారు. అప్పటి సీఎం కేసీఆర్‌కు మానవత్వం లేదన్నారు. ఆవిర్భావం వేడుకలకు కేసీఆర్‌ను ఆహ్వానించామని.. వస్తారా రారా అన్నది ఆయన విజ్ఞతకు వదిలేస్తామన్నారు.జూన్‌లో అన్ని జిల్లాల్లో మంత్రులు పర్యటిస్తారని.. అభివృద్ధిపై సమీక్షలు ఉంటాయన్నారు. బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు గెలవదని.. ఫలితాల తర్వాత ఆ పార్టీ ఉండదన్నారు. బీజేపీ జూటా పార్టీ అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. మోడీ ప్రధానిగా చేసిన అభివృద్ధి చెప్పకుండా.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రచారం చేశారని ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో పోలీసులు తమ పని తాము చేసుకుంటున్నారని.. ఎంత మంది లోపలికి వెళ్తారు అన్నది త్వరలో తెలుస్తుందన్నారు.

# టొబాకో యాడ్‌లో నటించేందుకు పుష్ప నిరాకరణ

## పదికోట్లు ఇస్తామని చెప్పినా నో అన్న బన్నీ

'పుష్ప'తో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అల్లు అర్జున్ పొగాకు కంపెనీల ఉత్పత్తుల్లో నటించేందుకు నిరాకరించారు. ఓ యాడ్‌లో నటిస్తే పదికోట్లు ఇస్తామన్న ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. ఇలా పొగాకు ఉత్పత్తులకు సంబంధించి తన దగ్గరకు వచ్చిన ఓ ప్రకటనను మరో ఆలోచన లేకుండా తిరస్కరించారు. అభిమానులను తప్పుదోవ పట్టించి, వారి ఆరోగ్యానికి నష్టం కలిగేలా ఎప్పుడూ ప్రవర్తించనని స్పష్టం చేశారు. కేవలం నటన మాత్రమే కాదు, సామాజిక బాధ్యతల విషయంలో అల్లు అర్జున్ ముందుంటారు. ఇప్పటికే మొక్కలు నాటే కార్యక్రమానికి తనవంతు ప్రచారం చేస్తూ, అభిమానులను సైతం ప్రోత్సహిస్తున్నారు. డబ్బు, పేరు ప్రఖ్యాతులు కన్నా కూడా అభిమానుల ప్రేమకే ఎక్కువ విలువ ఇస్తానని పలు వేదికలపైనా చెప్పారు. వరల్డ్ టుబాకో డే సందర్భంగా ఈ విషయం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా చక్కర్లు కొడుతోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప: ది రైజ్'. ఈ మూవీ విడుదలైన తర్వాత దేశవ్యాప్తంగా పుష్పరాజ్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఓ ప్రముఖ పొగాకు ఉత్పత్తుల సంస్థ బన్నిని కలిసింది. తమ ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఉండాలని కోరింది. ఈ ఆఫర్‌ను ఆయన నిర్మొహమాటంగా తిరస్కరించారట. ఈ యాడ్ చేస్తే రూ.10 కోట్ల వరకూ ఇస్తామని ఆఫర్ చేసినా, చేయనని స్పష్టంగా చెప్పారట. నేరుగా తీసుకోకపోయినా 'పుష్ప: ది రూల్'లో పుష్పరాజ్ ధూమపానం చేసే ప్రతి సీన్‌లోనూ బ్యాగ్రౌండ్‌లో తమ బ్రాండ్ లోగో కనిపించేలా చూడాలని కోరిందట. అందుకు కూడా బన్ని నో చెప్పారట. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పుష్ప2: ది రూల్' ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్, సునీల్, రావు రమేశ్, అనసూయ, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ



ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రంలోని పాటలు యువతను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# అందరికీ నచ్చిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటించారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. భారీ అంచనాలతో మే 31వ తేదీన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకి అన్ని వర్గాల నుంచి విశేష స్పందన స్పందన వస్తోంది. కథా నేపథ్యం కొత్తగా ఉందని, ఎమోషనల్ సన్నివేశాలు కట్టిపడేశాయని ప్రేక్షకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించిన కథానాయకుడు విశ్వక్ సేన్, దర్శకుడు కృష్ణ చైతన్య తమ సంతోషాన్ని పంచుకున్నారు. తఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు థియేటర్లలో సినిమాలను ఆదరించడంలో ఎప్పుడూ ముందుంటారు. సినిమా చూసి నిజాయితీగా రివ్యూ ఇవ్వడంలో తప్పులేదు. కానీ కొందరు సినిమా చూడకుండానే రివ్యూ రాస్తున్నారు. మరికొందరైతే కావాలని నెగటివ్ రివ్యూలు రాస్తున్నారు. అలాంటి రివ్యూలను పట్టించుకోకుండా.. ఎందరో ప్రేక్షకులు సినిమాలు చూడటానికి ముందుకొస్తున్నారని అన్నారు. 'గామి', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఇలా విశ్వక్ సేన్ సినిమాల ఎంపిక వైవిధ్యంగా ఉందని ప్రశంసలు రావడం ఆనందంగా ఉందని, ఇక ముందు కూడా ఇలాగే ప్రేక్షకులకు కొత్తదనం ఉన్న సినిమాలను అందిస్తానన్నారు. సినిమాకి వస్తున్న స్పందనతో చాలా హ్యాపీగా ఉన్నామని త్వరలో సక్సెస్ మీట్ నిర్వహిస్తామన్నారు. దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన పట్ల చాలా సంతోషంగా ఉన్నామని. యువత యాక్షన్ సన్నివేశాలను, డైలాగ్స్ ని బాగా ఎంజాయ్ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని.. సెకండాఫ్ లో ఎమోషనల్ సన్నివేశాలు




బాగా కనెక్ట్ అయ్యామని చెబుతుంటే హ్యాపీగా ఉందన్నారు. బాలకృష్ణగారు, వారి కుటుంబం సినిమా చాలా బాగుందని అభినందించడం.. మాటల్లో చెప్పలేని ఆనందాన్ని కలిగించిందని అన్నారు.

# ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా మనమే

## ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుందన్న కృతిశెట్టి

శర్వానంద్, కృతి శెట్టి జంటగా వస్తున్న సినిమా 'మనమే' జూన్ 7న విడుదలవుతోంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు, నిర్మాత టిజి విశ్వప్రసాద్. ఈ నేపథ్యంలో కథానాయకురాలు కృతి శెట్టి మూవీ విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు. ఇందులో నా క్యారెక్టర్ పేరు సుభద్ర. ఇప్పటి వరకూ నేను చేసిన క్యారెక్టర్స్ కి డిఫరెంట్ గా వుంటుంది. నాకు చాలా కొత్తగా వుంటుంది. ఇప్పటివరకూ క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేశాను. కానీ ఈ క్యారెక్టర్ చాలా స్ట్రిక్ట్ గా వుంటుంది. షూటింగ్ సమయంలో డైరెక్టర్ శ్రీరామ్ గారిని ఇంత స్ట్రిక్ట్ గా వుంటుందా?! అని చాలా సార్లు అడిగాను. ఆయన అంత స్ట్రిక్ట్ గా కావాలని చెప్పారు. ఆయన విజన్‌ని ఫాలో అయ్యాను. పర్శనల్ గా నాకు పెద్ద కోపం రాదు. పెద్దగా అరవను. చాలా కామ్ గా వుంటాను. సుభద్ర క్యారెక్టర్ నాకు పూర్తిగా కొత్త. శర్వానంద్ గారు వన్ అఫ్ ది బెస్ట్ పెర్ఫార్మర్. నిన్న సినిమా చూశాను. ఆయన ప్రతి సీన్ లో అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ఆయన ఎక్స్ పీరియన్స్ కనిపించింది. ఇందులో నాకు ఓ ఫేవరట్ సీన్ వుంది. ఆ సీన్ కోసం చాలా వెయిట్ చేశాను. ఎలా చేయాలో అని చాలా అలోచించాను. కానీ శర్వానంద్ గారు చాలా కాజ్యువల్ గా వచ్చి ఆ సీన్ ని ఒక్క నిమిషంలో అద్భుతంగా ఫినిష్ చేశారు. నేను స్టన్ అయిపోయాను. శర్వానంద్ గారు పెర్ఫార్మెన్స్ ని మ్యాచ్ చేయడం చాలా కష్టం. తనతో వర్క్ చేయడం చాలా ఆనందంగా వుంటుంది. అందులో ఒక బేబీ కూడా వుంది. బేబీ తో షూట్ చేయడం అంత ఈజీ కాదు. అయితే శర్వానంద్ గారు చాలా బ్యూటీఫుల్ గా హ్యాండిల్ చేశారు.

'మనమే' స్ట్రాంగ్ ఎమోషన్ కనెక్ట్ వున్న ఎంటర్ టైనింగ్ ఫిల్మ్. ఇందులో వండర్ ఫుల్ కిడ్, పేరెంట్ ఎమోషన్ వుంది. అది గ్లోబల్ ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా మా ముగ్గురి క్యారెక్టర్స్ చుట్టూ వుంటుంది. అందుకే మనమే అనే పేరు పెట్టాం. ఇది పెర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రతి సీన్ లో ఎంటర్ టైన్మెంట్ వుంటుంది.సక్సెస్ ఫెయిల్యూర్ మన చేతిలో



వుండదు. మన చేతిలో లేని విషయాలు గురించి ఎక్కువగా ఆందోళన చెందకూడదని ఈ ప్రయాణంలో నేర్చుకున్నాను.నాకు ప్రిన్సెస్ క్యారెక్టర్స్ చేయడం ఇష్టం. 'బాహుబలి' లో అనుష్క గారి లాంటి క్యారెక్టర్స్. అలాగే యాక్షన్ , మార్షల్ ఆర్ట్స్ బ్యాక్ డ్రాప్ వున్న రోల్స్ చేయాలని వుంది.మూడు తమిళ్ ఫిలిమ్స్ చేస్తున్నాను. అలాగే టోవినో థామస్ తో ఒక మలయాళం ఫిల్మ్ చేస్తున్నాను అని వివరించారు.

# మిస్టర్ అండ్ మిసెస్ మహి

## ప్రేక్షకులకు కనెక్ట్ కాలేక పోయిన క్రికెట్ నేపథ్యం

స్పోర్ట్స్ డ్రామాలకి పెట్టింది పేరు బాలీవుడ్. హాకీ మొదలుకుని కుస్తీ వరకూ పలు రకాల క్రీడల్ని స్పృశిస్తూ సినిమాలు రూపొందుతుంటాయి. ఈ మధ్యే అజయ్ దేవగణ్ 'మైదాన్' వచ్చింది. ఇప్పుడు క్రికెట్ నేపథ్యంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. రాజ్ కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా నటించడం.. అగ్ర నిర్మాత కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ నుంచి వస్తుండడంతో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి.

మహేంద్ర (రాజ్ కుమార్ రావ్) ఓ ఫెయిల్యూర్ క్రికెటర్. మరో ఏడాది అవకాశమిస్తే తానేంటో నిరూపించుకుంటానని బతిమాలతాడు. అయినా తండ్రి వినిపించుకోకుండా తన స్పోర్ట్స్ షాప్ నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తాడు. మహిమ అగర్వాల్ (జాన్వీ కపూర్)తో పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తారు. తన ఫెయిల్యూర్ స్టోరీ చెప్పినప్పటికీ మహేంద్ర మనసు నచ్చి పెళ్లి చేసుకోవడానికి అంగీకారం తెలుపుతుంది మహిమ. వైద్యురాలైన ఆమెకీ క్రికెట్ అంటే పిచ్చి. అలా ఆ ఇద్దరి క్రికెట్ ప్రేమ వాళ్లని ఎక్కడిదాకా

తీసుకెళ్లింది?విజయవంతమైన క్రికెటర్ కావాలనుకున్న మహేంద్ర కలలు ఎలా నెరవేరాయనేది మిగతా కథ. క్రీడా నేపథ్యంలో సాగే కథలన్నీ ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఫెయిల్యూర్స్‌తో అప్పటివరకూ అండర్‌డాగ్‌లా కనిపించిన హీరో... చివరికొచ్చేసరికి విజేతగా నిలిచి తన కలని నెరవేర్చుకుంటాడు. ఆ మధ్యలో నడిచే డ్రామా ఎంత వైవిధ్యంగా, ఎంత ఆసక్తికరంగా ఉందన్నదే సినిమా ఫలితాన్ని నిర్దేశిస్తురది. హీరోకి కోచ్ కావాలనే కోరిక కలగడం, హీరోయిన్ బ్యాట్ పట్టడంతోనే ఈ కథ ప్రయాణమేమిటో ప్రేక్షకుడికి అర్థమైపోతుంది. మధ్యలో డ్రామా కోసమని మైదానం నుంచి బయటికొచ్చి, భార్యాభర్తల మధ్య ఐడెంటిటీ గొడవని సృష్టించినా అదేమంత రక్తికట్టదు. మహిమ ఇంకా పూర్తిస్థాయి క్రికెటర్ కాకముందే, హీరో మహేంద్ర తన గుర్తింపు కోసం పాకులాట మొదలుపెట్టే సన్నివేశాలు కథకి అతకలేదు. చెప్పాల్సిన కథేమీ లేక ఇలా మరో దారిని ఎంచుకున్నట్టు అనిపిస్తుంది. హీరో, హీరోయిన్ల నేపథ్యం, పెళ్లి ప్రయాణం వరకూ సినిమా ఆకట్టుకుంటుంది. ఆ తర్వాత కథ సాదాసీదాగా మారిపోయింది. ప్రతీ సన్నివేశం ప్రేక్షకుడికి ఊహకు తగ్గట్టుగా సాగుతుంటుంది. ద్వితీయార్ధంలో అయితే హీరోకీ, ఆయన తల్లికీ మధ్య సాగే సన్నివేశాల్లో తప్ప ఎక్కడా మెరుపులు కనిపించవు. కథ, కథనాల కంటే జాన్వీకపూర్, రాజ్‌కుమార్ రావ్ జోడీ నటనే సినిమాని కొంతవరకు నిలబెట్టింది. సినిమాల్లో క్రికెట్ మ్యాచ్‌ని చూపిస్తున్నప్పుడు, ప్రేక్షకుడు నిజంగానే ఓ ఉత్కంఠ భరితమైన మ్యాచ్‌ని చూస్తున్న అనుభూతి కలిగేలా సన్నివేశాల్ని మలుస్తుంటారు దర్శకులు. కానీ, ఇందులో ఆ తరహా జాగ్రత్తలూ తీసుకోలేదు. హీరోయిన్ వెళ్లి వరుసగా సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ని గెలిపించేస్తుంది. రచనలోనే చాలా లోపాలు కనిపిస్తాయి. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది.



అనయ్ గోస్వామి కెమెరా పనితనం మెప్పిస్తుంది. పాటలు బాగున్నాయి. జాన్ స్టీవార్ట్ ఏడూరి నేపథ్య సంగీతం సినిమాపై ప్రభావం చూపించింది.




# యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో అవకతవకలపై విచారణ



హైదరాబాద్,జూన్1: ల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ చేపట్టింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో అవకతవకలపై జస్టిస్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించి.. అధికారులతో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి సమావేశమయ్యారు. థర్మల్ పవర్ ప్లాంట్‌లోకి మీడియాను అధికారులు అనుమతించలేదు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి టెండర్లు ఎందుకు పిలవలేదో విచారణ జరిపామని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విచారణ కమిటీ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం టెండర్లు ప్రకటించకుండా బీహెచ్ఈఎల్‌కు కేటాయించడంపై విచారణ చేశామన్నారు. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లపై కూడా విచారణ జరుగుతుందన్నారు. భద్రాద్రి, యాదాద్రి, పీపీఏల వ్యవహారాల్లో తీసుకున్న నిర్ణయాల వెనక భాగస్వాములైన వారందరికీ నోటీసులు ఇచ్చామన్నారు. ప్రజల అభిప్రాయాలను తీసుకునేందుకు నోటీసులు ఇచ్చామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలింగ్ తర్వాత నోటీసులు ఇచ్చామన్నారు. అయినప్పటికీ నోటీసులకు మంచి స్పందన వచ్చిందన్నారు. చాలామంది వారి అభిప్రాయాలను మాకు చెప్పారని.. ప్రభుత్వ నిర్దేశించిన సమయంలోపే రిపోర్టు అందజేస్తామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆగస్టులో మొదటి యూనిట్, సెప్టెంబర్‌లో రెండవ యూనిట్.. ఆరు నెలల తర్వాత మిగిలిన యూనిట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని అధికారులు చెప్పారని ఆయన వెల్లడించారు.

## కరెంట్ కోతలపై అర్ధరాత్రి ధర్నా

**కాంగ్రెస్ సర్కారు తీరుపై జనాగ్రహం.. ఆందోళన**
**హైదరాబాద్ బాచుపల్లి సబ్‌స్టేషన్‌వద్ద స్థానికుల ధర్నా**
**పలు కాలనీల్లో మూడు గంటలపాటు నిలిచిన విద్యుత్తు**
**నిరసనతో దిగివచ్చిన సిబ్బంది.. సరఫరా పునరుద్ధరణ**
**కరెంటు కోతలపై నెటిజన్ల ఆగ్రహం**
**ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఎక్స్'లో పోస్టుల వెల్లువ**



దుండిగల్,జూన్1: 33/11కేవీ బాచుపల్లి సబ్‌స్టేషన్, పలు ఫీడర్ల పరిధిలో రాత్రి 10.30 గంటల నుంచి 3 గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో సాయినగర్, ఇంద్రానగర్, ప్రగతినగర్‌లోని జీపీఆర్ లేఅవుట్ కాలనీవాసులు సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరెంటు కోతలు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.
రాత్రి 1.30 గంటలకు సరఫరా పునరుద్ధరించడం తో ఆందోళన విరమించారు. ఓవర్‌లోడ్ కారణంగా సరఫరా నిలిచిపోయిందని ఏఈ శాం తకుమార్ తెలిపారు. బొల్లారంలోని టీనాల్యాబ్ వద్ద జంపర్ కట్ కావడంతో వైరుకింద పడి మంటలు చెలరేగినట్లు పేర్కొన్నారు. మరమ్మతుల అనంతరం సరఫరా చేశారు.

## మేడిగడ్డను సందర్శించిన నిపుణుల కమిటీ




మహదేవపూర్, జూన్ 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ లోని మేడిగడ్డ బరాజ్‌ను ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్ర నిపుణుల కమిటీ శనివారం పరిశీలించిం ది. బరాజ్ కుంగుబాటుకు గల కారణాలు, లోపాల అధ్యయానికి ప్రభు త్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. గతంలో బరాజ్‌ను పరిశీలించిన కమిషన్ తాజాగా శనివారం ఎన్‌డీఎస్‌ఏ సూచన మేరకు బరాజ్ దిగువన 7వ బ్లాక్ వద్ద జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించింది. బరాజ్ దిగువన అప్, డౌన్ స్ట్రీమ్ 7, 8వ బ్లాకుల పనులను పరిశీలించారు. కాపర్ సీట్ పైల్స్ పనులు, సీసీ బ్లాక్ అమరిక, 20, 21 గేట్ల కటింగ్, కుంగిన ప్రాంతంలో సిమెంట్, ఇసుకతో పూడ్చేందుకు చేపట్టిన పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ఎల్టీ ప్రతినిధులను అడిగి తెలుసుకుని, ఫొటో లు తీసుకున్నారు. కాళేశ్వరంలోని అన్నారం (సరస్వతి) బరాజ్‌ను సందర్శించి లీకేజీ పనులను పరిశీలించారు.

మేడిగడ్డ వద్ద 'గ్రౌటింగ్' ప్రారంభం

మేడిగడ్డ బరాజ్ వద్ద కుంగిన 19, 20, 21వ పియర్స్ వద్ద ఏర్పడిన ఖాళీ ప్రదేశాలను పూడ్చేందుకు సి మెంట్, ఇసుకతో గ్రౌటింగ్ పనులను నిర్మాణ సంస్థ ప్రారంభించింది. గ్రౌటింగ్ కో సం కుంగిన ప్రాంతంలో బోర్‌వెల్స్ ప నులను చేపట్టారు. వీటి ద్వారా సిమెంట్, ఇసుక మిశ్రమంతో గ్రౌటిం గ్ యంత్రాల సాయంతో 7వ బ్లాకులో కుంగిన పిల్లర్లను పూడ్చుతున్నారు.



# మిచెల్ స్టార్క్ వల్లే టైటిల్ గెలిచాం: గౌతమ్ గంభీర్



ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అద్భుత ప్రదర్శనతోనే నాకౌట్ మ్యాచ్‌ల్లో విజయం సాధించామని కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) మెంటార్ గౌతమ్ గంభీర్ అన్నాడు. మిచెల్ స్టార్క్ తమకు ఎక్స్ ఫ్యాక్టర్‌గా మారుతాడని ఊహించే అతనిపై కోట్లు కుమ్మరించామని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన క్వాలిఫయర్-1, ఫైనల్లో మిచెల్ స్టార్క్ నిప్పులు చెరిగాడు. ఈ సీజన్ మొత్తం విఫలమైన అతను.. కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో మాత్రం 5 వికెట్లు పడగొట్టి కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఫైనల్లో మిచెల్ స్టార్క్ వేసిన బంతికి సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ బంతిపై సర్వత్రా ప్రశంసల జల్లు కురిసింది. బాల్ ఆఫ్ ది ఐపీఎల్ అంటూ నెటిజన్లు కొనియాడారు. తాజాగా మిచెల్ స్టార్క్ ప్రదర్శనపై గంభీర్ స్పందించాడు. అయితే క్రికెట్‌లో ఆడలేని బాల్ అంటూ ఏదీ ఉండదని చెప్పాడు. 'మిచెల్ స్టార్క్ మాకు అత్యంత కీలకమైన బౌలర్ అని నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నా. ఆరంభంలో అతను ఇబ్బంది పడ్డాడు. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు సమయం తీసుకున్నాడు. కానీ, సరైన సమయంలో టచ్‌లోకి వచ్చాడు. ఐపీఎల్‌లో భారీ మ్యాచ్‌లు అంటే క్వాలిఫయర్, ఫైనల్. ఈ నాకౌట్ మ్యాచ్‌ల్లో రాణిస్తేనే టైటిల్ గెలవగలం. మా జట్టు విషయంలో అదే జరిగింది. మిచెల్ స్టార్క్ అసాధారణ ప్రదర్శన మమ్మల్ని విజేతగా నిలబెట్టింది. చాలా మంది అభిషేక్ శర్మను ఔట్ చేసిన బంతిపై మాట్లాడారు. ఇలాంటి బంతిని సంధించిన బౌలర్‌ను అభినందించకుండా ఉండలేం. క్రికెట్‌లో అతి తక్కువ బంతులను మాత్రమే ఆడలేం అనుకుంటాం. స్టార్క్ వేసిన బంతి కూడా ఆ కోవలోకి వస్తుంది. అయితే ఆ బంతి ఆడలేనిదని నేను చెప్పలేను. ఎందుకంటే క్రికెట్‌లో ఆడలేని బంతి ఏది లేదనే మనం ఆటను నేర్చుకుంటాం. మిచెల్ స్టార్క్‌కు పెట్టిన ధరపై చాలా రకాల వాదనలు వినిపించాయి. అంత ధర అవసరమా? అనే విమర్శలు వచ్చాయి. కానీ స్టార్క్ మా ఎక్స్ ఫ్యాక్టర్.'అని గంభీర్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో స్టార్క్ 14 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసాడు. క్వాలిఫయర్-1లో మూడు వికెట్లు తీసిన అతను ఫైనల్లో 2 వికెట్లతో సన్‌రైజర్స్ పతనాన్ని శాసించాడు.

# టీమిండియా కోచ్ పదవికి గంభీర్ సరైనోడు: సౌరవ్ గంగూలీ

టీమిండియా మాజీ ఓపెనర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్‌పై బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రశంసల జల్లు కురిపించాడు. టీమిండియా హెడ్ కోచ్ పదవికి గంభీర్ దరఖాస్తు చేసుకొని ఉంటే.. అతను అద్భుతమైన కోచ్‌గా నిలుస్తాడని కొనియాడాడు. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవి కాలం టీ20 ప్రపంచకప్ 2024తో ముగియనుంది. ఈ క్రమంలోనే బీసీసీఐ కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియను మొదలుపెట్టింది. అయితే టీమిండియా తదుపరి హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియామకం పూర్తయిందని, అతి త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు గంభీర్ మాత్రం.. తాను కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) మెంటార్‌గానే కొనసాగుతానని ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశాడు. కేకేఆర్‌ను సక్సెస్‌ఫుల్ టీమ్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. దాంతో టీమిండియా తదుపరి హెడ్ కోచ్ ఎవరా? అనేదానిపై క్లారిటీ రావడం లేదు. కొత్త హెడ్ కోచ్ పదవికి దరఖాస్తుల గడువు మే 27నే ముగియగా.. గంభీర్ అప్లై చేసుకున్నాడా? లేదా? అనేదానిపై కూడా స్పష్టమైన సమాచారం లేదు. ఈ క్రమంలోనే గౌతమ్ గంభీర్.. టీమిండియా హెడ్ కోచ్ పదవి చేపట్టే అవకాశాలపై సౌరవ్ గంగూలీని ప్రశ్నించగా.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'టీమిండియా హెడ్ కోచ్‌గా భారతీయుడే ఉండాలనే వాదనకు నేను అనుకూలంగా ఉంటాను. ఎందుకంటే మన దేశంలో ప్రతిభావంతమైన కోచ్‌లు ఎందరో ఉన్నారు. తమ ఆటతో భారత్ క్రికెట్‌లో అద్భుతాలు చేసిన ఆటగాళ్లు ఉన్నారు. వాళ్లు మళ్లీ జట్టులో భాగమవ్వడం భారత క్రికెట్‌కే మంచిది. భారత్ కోచ్‌గా గంభీర్ ఎంపికైతే అతను అత్యుత్తమ కోచ్‌గా నిలుస్తాడు. అయితే అతను టీమిండియా హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకున్నాడా? లేదా? అనే విషయం నాకు తెలియదు. దరఖాస్తు చేసుకుంటేనే అతను టీమిండియా హెడ్ కోచ్‌గా ఎంపికవుతాడు. దరఖాస్తుకు తుది గడువు మే 27నే ముగిసిందనుకుంటా. కావాలనుకుంటే బీసీసీఐ ఈ గడువును పెంచవచ్చు. టీమిండియా హెడ్ కోచ్ పదవి చేపట్టేందుకు గంభీర్ సుముఖంగా ఉంటే అతను అత్యుత్తమ కోచ్‌గా మారుతాడు. ఆటపై గంభీర్‌కు ఉన్న పిచ్చి నాకు బాగా తెలుసు. ఈ ఏడాది కేకేఆర్ తరఫున అతని పనితీరును మనమంతా



చూశాం. ఆటపై అతనికి ఉన్న మక్కువ, కసిని అందరూ చూశారు. బీసీసీఐ అతనికి టీమిండియా హెడ్ కోచ్ పదవి ఇవ్వాలని నిర్ణయించుకుంటే అతనే సరైనోడు.'అని గంగూలీ చెప్పుకొచ్చాడు.

..

# క్రికెట్ కి గుడ్ బై చెప్పిన దినేశ్ కార్తిక్





స్టార్ క్రికెటర్ దినేష్ కార్తీక్ క్రికెట్ నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ఇటీవల ఐపీఎల్ నుంచి తప్పుకున్న అతడు తాజాగా అన్ని ఫార్మాట్ల క్రికెట్?కు రిటైర్మెంట్ ప్రకటించాడు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ కార్తీక్ రాణించాడు. కార్తీక్ ఎక్స్ ఖాతాలో 'గత కొన్ని రోజులుగా మీ ఆప్యాయత, మద్దతు, ప్రేమకు నేను పొంగిపోయాను. దీన్ని సాధ్యం చేసిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు, హృదయపూర్వక ధన్యవాదాలు. చాలా కాలం ఆలోచించిన తర్వాత క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. నేను నా రిటైర్‌మెంట్‌ను అధికారికంగా ప్రకటిస్తున్నాను.' అని రాసుకొచ్చారు. ఈ క్రమంలో డీకే తన కెరీర్?లో 26 టెస్టులు, 94 వన్డేలు, 60 టీ20 మ్యాచ్?లు ఆడాడు.కాగా.. ఇటీవల టీమిండియా మాజీ వికెట్‌కీపర్, బ్యాటర్ దినేశ్ కార్తీక్ కొద్ది రోజుల కిందటే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికి వార్తల్లో నిలిచాడు. సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన అనంతరం డీకే క్రికెట్ ప్రపంచం మొత్తం నుంచి ఘనంగా సెడాంఫ్‌ను అందుకున్నాడు. క్రికెట్‌కు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి కమిట్‌మెంట్స్ లేకపోవడంతో సేద తీరుతున్న డీకే.. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాతో కలిసి జావెలిన్ త్రో ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. డీకే జావెలిన్ త్రో ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యాలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. దీనికి సంబంధించిన ఓ వీడియో బాగా వైరలవుతంది. ఈ వీడియోలో డీకే రెండు ప్రయత్నాల అనంతరం బల్లెంను విజయవంతంగా నిర్దేశిత ప్రాంతం ఆవలికి విసరగలిగాడు. లాస్ట్ ఛాన్స్ అని నీరజ్‌ను అడిగి మరీ జావెలిన్‌ను అందుకున్న డీకే.. ప్రొఫెషన్ అథ్లెట్‌లా రన్ అప్ తీసుకుని జావెలిన్‌ను సంధించాడు.


# భారతీయులు బిచ్చగాళ్లు..

## ప్యాట్ కమిన్స్ సంచలన వ్యాఖ్యలు!

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్, ఆస్ట్రేలియా సారథి ప్యాట్ కమిన్స్‌కు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ప్రస్తుతం ఈ వీడియోపై సోషల్ మీడియా వేదికగా దుమారం రేగుతోంది. భారత అభిమానులు బిచ్చగాళ్లని ప్యాట్ కమిన్స్ అన్నాడని కొందరు ఈ వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్‌కు చెందిన నెటిజన్లు ఈ ప్రచారానికి తెరలేపారు. కానీ ఆ వీడియోలో ప్యాట్ కమిన్స్ ఎక్కడ కూడా బిచ్చగాళ్లు అనే పదం ఉపయోగించలేదు. చాలా మంది భారత అభిమానులు డబ్బు సాయం కోసం తనను సంప్రదిస్తున్నారని మాత్రమే చెప్పాడు. 'కొంతమంది భారత అభిమానులు.. నా ఇంటి అడ్రస్ కనుగొని డబ్బు సాయం చేయాలని ఆసుపత్రి బిల్లులను పంపించారు. మరికొందరు ఆఫరేషన్స్, ఇతర చికిత్సలు చేసుకోవడానికి ఆర్థిక సాయం చేయాలని రిక్వెస్ట్ చేస్తూ మెసేజ్‌లు పంపుతున్నారు. ఇది నాకు చాలా ఇబ్బందిగా విచిత్రంగా అనిపించింది.'అని ఆ వీడియోలో కమిన్స్ చెప్పుకొచ్చాడు. అయితే ఈ వీడియోను కొందరు పనిగట్టుకొని భారతీయులు బిచ్చగాళ్లని ప్యాట్ కమిన్స్ అన్నాడనే క్యాప్షన్‌తో వైరల్ చేస్తున్నారు. అయితే ఈ ప్రచారంపై భారత అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బు సాయం అడిగినంత మాత్రానా బిచ్చగాళ్లు అయిపోతారా? అయినా కమిన్స్ ఎక్కడా ఆ మాట అనలేదని గుర్తు చేస్తూ సదరు నెటిజన్లపై మండిపడుతున్నారు. కరోనా సమయంలో ప్యాట్ కమిన్స్.. భారత ప్రధాన సహాయనిధికి 50 వేల డాలర్లను విరాళంగా ఇచ్చాడు. ఆ సమయంలో ఆక్సిజన్ కొరత లేకుండా ఈ డబ్బును ఖర్చు చేయాలని కమిన్స్ కోరాడు. ఈ సాయంతో కమిన్స్‌ను గొప్పవాడిగా భావించిన కొందరు భారత అభిమానులు.. తమకు సాయం చేయాలని రిక్వెస్ట్ చేసి ఉండవచ్చు. పెద్ద సంఖ్యలో సాయం చేయాలనే మెసేజ్‌లు రావడంతో కమిన్స్ కాస్త ఇబ్బంది పడి ఉంటాడు. ఆ విషయాన్ని అతను తెలియజేశాడు. కానీ ఎక్కడా కూడా భారత్‌ను, ఇక్కడి ప్రజలను తక్కువ చేసి మాట్లాడలేదని క్రికెట్ అభిమానులు గుర్తు చేస్తున్నారు. కమిన్స్‌కు భారత్ అంటే ఎంతో గౌరవం ఉందని, అందుకే కరోనా సమయంలో సాయం చేశాడని గుర్తు చేస్తున్నారు. ఐపీఎల్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సారథ్యం వహించిన ప్యాట్ కమిన్స్... అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. సూపర్ కెప్టెన్సీతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. తృటిలో టైటిల్ చేజారినా.. తమ ఆటతీరుతో అభిమానుల మనసులను గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియా తరఫున డబ్ల్యూటీసీ టైటిల్‌తో పాటు వన్డే ప్రపంచకప్ గెలిచిన కమిన్స్.. టీ20 ప్రపంచకప్ 2024పై కన్నేసాడు.


..

టీమిండియాలో ఎంతో టాలెంట్ ఉంది



మెగా టోర్నీల్లో పాకిస్థాన్‌పై భారత్‌కు మెరుగైన రికార్డు ఉందని, అదే జోరు టీ20 ప్రపంచకప్‌లోనూ రోహిత్ సేన కొనసాగిస్తుందని మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ అన్నాడు. ఈ మహా సమరానికి అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తుంది. తొలి దశలో ఇరవై దేశాలు నాలుగు గ్రూప్‌లుగా విడిపోయి తలపడనున్నాయి. గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్, ఐర్లాండ్, అమెరికా, కెనడా ఉన్నాయి. పసికూనలపై రోహిత్ సేన సులవుగా గెలిచి తదుపరి దశకు చేరుకోవడం దాదాపు ఖాయమే. కానీ భారత్-పాకిస్తాన్ మ్యాచ్ కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. న్యూయార్క్ వేదికగా జూన్ 9న ఈ హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. అయితే వన్డే వరల్డ్ కప్‌లో ఆది నుంచి ఇప్పటివరకు పాకిస్థాన్‌పై భారత్‌దే పైచేయి. ప్రతి మ్యాచ్‌లోనూ విజయఢంకా మోగించింది మనమే. టీ20 వరల్డ్ కప్‌ల్లోనూ ఓ మ్యాచ్ మినహా మిగిలిన్నింట్లో ఇండియానే గెలిచింది. 2021 టీ20 వరల్డ్ కప్‌లో గెలుపే పాకిస్థాన్‌కు నిలిచిన ఏకైక ఊరట. ఇక గత 2022 టీ20 వరల్డ్ కప్, 2023 వన్డే వరల్డ్ కప్‌లో భారత్‌దే ఘన విజయం. కాగా, ఈ సారి పాకిస్థాన్‌పై టీమిండియానే గెలుస్తుందని గంగూలీ ధీమా వ్యక్తం చేశాడు. అయితే భారత ఆటగాళ్లు స్వేచ్ఛగా ఆడాలని సూచించాడు. 2022 టీ20 కప్‌లో టీమిండియా ప్లేయర్లు ఒత్తిడితో ఆడారని పేర్కొన్నాడు. "సుదీర్ఘ కాలంగా పాకిస్థాన్‌పై మనకు మెరుగైన రికార్డు ఉంది. గత వన్డే వరల్డ్ కప్‌లో భారత్‌కు వచ్చిన పాకిస్థాన్‌ను అహ్మదాబాద్‌లో సునాయాసంగా గెలిచాం. అయితే వన్డే ఫార్మాట్ కంటే టీ20 ఫార్మాట్‌లో పాకిస్థాన్ ప్రమాదకరమైన జట్టు. కానీ మనం బాగా ఆడితే పైచేయి సాధించవచ్చు. స్వేచ్ఛగా ఆడాలి. స్వేచ్ఛగా అని ఎందుకు ప్రత్యేకంగా చెబుతున్నానంటే.. 2022 వరల్డ్ కప్‌లో టీమిండియా స్వేచ్ఛగా ఆడినట్లు కనిపించలేదు" "గెలుపోటముల గురించి ఆలోచించకుండా పోరాడాలి. వరల్డ్ కప్ గెలవాలని ఆడకూడదు. మ్యాచ్-మ్యాచ్‌లా బరిలోకి దిగి గెలవాలి. కప్ గెలిచే అవకాశాలు భారత్‌కు మెరుగ్గా ఉన్నాయి. టీ20 జట్టులా ఆడాలి. టీమిండియాలో ఎంతో టాలెంట్ ఉంది. దూకుడుగా ఆడేలా ప్రయత్నించాలి. కోహ్లి, రోహిత్, సూర్య, పంత్, దూబె, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా, శాంసన్ వంటి ఆటగాళ్లతో టీమ్ స్ట్రాంగ్‌గా ఉంది. బ్యాటింగ్‌లో తొలి బంతి నుంచి మోత మోగించాలి. డిఫెన్స్‌లో ప్రతి బంతిని చివరి బంతిగా బౌలింగ్ చేయాలి" అని గంగూలీ పేర్కొన్నాడు.

# 20 వరల్డ్ కప్‌లో ఈసారి సరికొత్త రూల్స్..?





నేటి నుంచి టీ20 వరల్డ్ కప్ 2024 ప్రారంభం కాబోతుంది. 2007లో మొదలైన ఈ మినీ వరల్డ్ కప్ ఇప్పటికే 8 ఎడిషన్స్ పూర్తి చేసుకుని 9వ సీజన్‌లోకి సక్సెస్ ఫుల్ గా అడుగు పెడుతుంది. గత 8 ఎడిషన్లలో ఐసీసీ ఈ మోడల్‌లో అనేక కొత్త రూల్స్ ను తీసుకొచ్చింది. అందుకు తగ్గట్టుగానే ఈసారి కూడా మరో కొత్త రూల్‌ను తీసుకొచ్చింది. కాగా, స్టాప్ క్లాక్ రూల్ ప్రయోగాత్మకంగా విజయవంతం కావడంతో ఈ వరల్డ్ కప్ నుంచి వైట్ బాల్ ఫార్మాట్‌లో ఈ నిబంధనను ఉపయోగించాలని ఐసీసీ నిర్ణయించింది. ఈ స్టాప్ క్లాక్ నియమం ప్రకారం.. రెండు ఓవర్ల మధ్య, ఒక టీమ్ తర్వాతి ఓవర్ స్టార్ట్ చేసేందుకు 60 సెకన్ల సమయం ఇవ్వనుంది. ఈ టైంలోపూ బౌలింగ్ జట్టు తదుపరి ఓవర్‌ను స్టార్ట్ చేయాలి.. ఒక ఓవర్ ముగిసిన వెంటనే, థర్డ్ అంపైర్ ఈ రూల్?ను అమలు చేస్తాడు. ఈ గడువులోపు ఓవర్ స్టార్ట్ చేయకపోతే, ఆన్-ఫీల్డ్ అంపైర్ బౌలింగ్ జట్టుకు రెండుసార్లు వార్నింగ్ ఇస్తాడు.. మూడవ హెచ్చరికపై ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తాడు. ఈ రన్స్ బ్యాటింగ్ జట్టు ఖాతాలో పడతాయి. ఇక, ఐసీసీ డిసెంబర్ 2023 నుంచి వైట్ బాల్ ఫార్మాట్‌లో స్టాప్ క్లాక్ నిబంధనను అమలు చేస్తుంది. ఈ రూల్ మ్యాచ్ సమయంలో 20 నిమిషాల టైంని ఆదా చేస్తుంది. ఇది సక్సెస్ కావడంతో టీ20 ప్రపంచకప్‌లో తొలిసారిగా ఈ నిబంధనను అమలులోకి తీసుకొచ్చింది. అయితే, నిజానికి మ్యాచ్ టైంలో కొన్ని సందర్భాల్లో ఈ రూల్ ను ఉపయోగించరు. ఈ నిబంధనను ఉపయోగించాలా వద్దా అనేది పూర్తిగా థర్డ్ అంపైర్ నిర్ణయంపై ఆధారపడి ఉంది. క్రిజ్‌లోకి కొత్త బ్యాట్స్‌మెన్ వచ్చినప్పుడు, డ్రింక్స్ టైంలో, బ్యాట్స్‌మన్ లేదా ఫీల్డర్‌కు గాయం అయినప్పుడు లేదా ఫీల్డింగ్ జట్టు సమయం కోల్పోకుండా ఉంటే ఈ నియమం పరిగణనలోకి తీసుకోబడదు అని ఐసీసీ వెల్లడించింది.

# సమరానికి సై



న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌లో ఈనెల 5న జరిగే అసలు సమరానికి టీమిండియా అస్త్రశస్త్రాలను పరీక్షించుకోనుంది. ఈక్రమంలో బంగ్లాదేశ్‌తో శనివారం వామప్ మ్యాచ్‌లో రోహిత్ సేన తలపడనుంది. టీమిండియాలోని 15 మంది ఆటగాళ్లు.. ఐపీఎల్‌లో ఆయాజట్లకు ప్రాతినిధ్యం వహించారు. దాంతో అందరికీ మ్యాచ్ ప్రాక్టీస్ కొరత ఏమాత్రం లేదు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి మినహా మిగిలిన 14 మంది క్రికెటర్లంతా బరిలో దిగనున్నారు. విరాట్ శుక్రవారమే జట్టుతో చేరిన నేపథ్యంలో అతడు ఈ మ్యాచ్‌కు దూరం కానున్నాడు. అయితే మెగా టోర్నీకి కాంబినేషన్లను రూపొందించడమే భారత్‌కు సవాలు కానుంది. మంచి ఫామ్‌లో ఉన్న యశస్వీ జైస్వాల్‌ను తుది జట్టులో ఎలా చేర్చాలన్నదే జట్టు మేనేజ్‌మెంట్ ముందున్న సమస్య. జైస్వాల్‌ను తీసుకొంటే పవర్ హిట్టర్ శివమ్ దూబేను పక్కన పెట్టక తప్పదు. అందువల్ల జైస్వాల్‌ను పక్కన పెడితే..రోహిత్, విరాట్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు. అదే జరిగితే టోర్నమెంట్ తదుపరి దశలో దూబేకు అవకాశం కల్పించవచ్చు. అలవోకగా సిక్సర్లు దంచే దూబే టోర్నమెంట్‌లో ఎక్స్ ఫాక్టర్ అవుతాడనేది విశ్లేషకుల అంచనా. బుమ్రాతో కొత్త బంతిని పంచుకొనే బౌలర్ విషయంలోనూ జట్టు సముచిత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఐపీఎల్‌లో సిరాజ్‌తోపాటు అర్ష్‌దీప్ ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు. దాంతో వీరి ఫామ్ జట్టును కలవరపరుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన డ్రాప్ ఇన్ పిచ్‌లపై అర్ష్‌దీప్ మెరుగ్గా బౌలింగ్ చేస్తాడని క్రికెట్ పండితులు చెబుతున్నారు. అమెరికాలో భారత్ మ్యాచ్‌లు ఉదయాన్నే మొదలవుతాయి కనుక..బౌలింగ్‌లో వైవిధ్యం కనబర్చడం ముఖ్యం. ఈ కోణంలో చూస్తే సిరాజ్ కంటే అర్ష్‌దీప్ మెరుగైన ప్రత్యామ్నాయం అవుతాడు. ఇక..స్లో వికెట్‌పై షకీబల్, మెహ్దీ హసన్, ముస్తాఫిజుర్‌ను మిడిలార్డర్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. కాగా, టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఆతిథ్య అమెరికా, కెనడా జట్ల మధ్య జరగనుంది. అదేరోజు రాత్రి 8 గంటలకు వెస్టిండీస్‌తో పపువా న్యూగిని జట్టు తలపడనుంది.

## ముగిసిన గాయత్రి జోడీ పోరాటం..

సింగపూర్: ప్రతిష్ఠాత్మకమైన సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ జోడీ గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో గాయత్రి-త్రిసా జంట 21-23, 11-21 తేడాతో జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ నమీ మత్సుయమా-చిహరు షిడా ద్వయం చేతిలో పోరాడి ఓడారు.

హోరాహోరీగా జరిగిన తొలి గేమ్‌లో భారత జంట ప్రత్యర్థి జంటకు చుక్కలు చూపెట్టింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ మొదటి గేమ్‌లో చివరి నిమిషంలో దూకుడు పెంచిన నాలుగో సీడ్ జపాన్ జోడీ టై బ్రేకర్‌లో గెలిచింది. ఇక రెండో రౌండ్‌లో గాయత్రి జంట పూర్తిగా తేలిపోయింది. దాంతో సింగపూర్ ఓపెన్‌లో భారత్ పోరాటం ముగిసింది.

ఇక ఈ టోర్నీలో గాయత్రి-త్రిసా జోడీ చిరస్మరణీయ ప్రదర్శనలతో ఆకట్టుకుంది. ఒలింపిక్స్ మెడలిస్ట్ సింధు, పురుషుల డబుల్స్ వరల్డ్ నెం.1 జోడీ సాత్విక్-చిరాగ్ శెట్టిలు, హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ వంటి స్టార్ షట్లర్లు వరుసగా విఫలమై ఆరంభంలోనే టోర్నీ నుంచి నిష్క్రమించగా.. గాయత్రి-త్రిసా మాత్రం వరుస విజయాలతో అందరి దృష్టి ఆకర్షించారు.

వీరిద్దరూ ప్రి క్వార్టర్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ దక్షిణ కొరియా జంటపై సంచలన విజయంతో అదరగొట్టింది. ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్ పోరులో ఆరో సీడ్ హాంకాంగ్ జంటను ఓడించి సత్తా చాటుకుంది. దాంతోపాటు తొలిసారి సూపర్ సిరీస్ టోర్నీలో సెమీఫైనల్లో ప్రవేశించి కొత్త రికార్డు నమోదు చేశారు.



## అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



**కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లా జూన్ 1 అక్షరం న్యూస్:** హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయం జయంతి వేడుకల కోసం ముస్తాబు చేశారు. తెల్లవారుజాము నుండే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. హనుమాన్ మందిరంలకు వెళ్లి సింధూరము,పూలమాలతో, ఇల్లేడి ఆకులు కలిపి మాల తయారుచేసి హనుమాన్ వేసి ధూప దీప నైవేద్యములు సమర్పించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేసి భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమములు, ప్రసాదములు పంచి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, కేతిపల్లి నరసింహారెడ్డి, వొడ్నాల రాజేష్,ఆశాడపు సురేష్, మద్దుల నరేష్, కలువల శ్యామ్ మరియు హనుమాన్ భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పారిశుద్ధ్యనికి ప్రాధాన్యత..

**- పారిశుద్ధ్యనికి ప్రతి ఒక్కరు సహకరించాలి...**
**- పురపాలక సంఘ చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి.**



**మహబూబాబాద్ బ్యూరో అక్షరం న్యూస్ జూన్ 1:** పారిశుధ్యం పట్ల అలసత్వం తగదని, దానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పురపాలక సంఘ చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి శనివారం పురపాలక కార్యాలయంలో పారిశుధ్యం పై పాలకమండలి కమిటీ సభ్యులతో, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దష్ట్యా పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పారిశుధ్యం పై అలసత్వం తగదని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్,వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న లిఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి , వార్డు కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, దండెబోయిన వెంకన్న , పోతురాజు రాజు , బానోత్ హరిసింగ్ , జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ , సానిటరీ ఇన్స్పెక్టర్ రాజేష్ , ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ క్రాంతి, జవాన్లు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంకు ఘన స్వాగతం



**హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్ 01(అక్షరం న్యూస్):** విదేశీ పర్యటన ముగించుకుని తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన హుస్నాబాద్ ఎమ్మెల్యే, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు శనివారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో హుస్నాబాద్ నియోజవర్గ కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులరెడ్డి,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గజ్జల సురేష్ ఘన స్వాగతం పలికారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా మంత్రి పొన్నం కు ఆంజనేయ స్వామి విగ్రహం అందించి, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికా పర్యటన ముగించుకుని రాష్ట్రానికి చేరుకోవడంతో పెద్ద సంఖ్యలో నియోజవర్గం నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

## దేవాలయాల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**- చింతకుంట విజయరమణ రావు**



**పెద్దపెల్లి రూరల్ జూన్ 1 అక్షరం న్యూస్:** పెద్దపల్లి మండలంలోని, పెద్దకల్వల గ్రామం లో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామి దేవాలయలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అధికారముందని విర్రవీగుడు తగదు

**- కాంగ్రెస్ నాయకులను హెచ్చరించినా బిఆర్ఎస్ నాయకులు**



**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూన్ 01 అక్షరం న్యూస్:** అధికారముందని విర్రవీగడం భవిష్యత్తుకు మంచిది కాదని రామగిరి బీఆరెస్ మండల నాయకులు హెచ్చరించారు. శనివారం నాగేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారముందని అక్రమ కట్టదాల పేరుతో ఇండ్లు కూలిస్తే అధికారం చేతులు మారగానే మీ ఇండ్లు కూలుతాయని తెలిపారు. ఎందుకంటే ఏదైతే సింగరేణి కోయిదలో అక్రమంగా కట్టారని ఎగురుతున్న కాంగ్రెస్ నాయకుని ఇల్లు ఆ పక్కనే అదే సింగరేణి మిగులు భూమి అయిన కోయిదాలో ఉందనే విషయం గుర్తెరుగాలని హితువు పలికారు. . అసలేం జరుగుతుందో తెలియకుండానే పిలవగానే పక్కన నిల్చున్న వాళ్లకన్నా సోయి ఉండాలే, ఇలాంటి పాపపు పనుల్లో భాగస్వాములైతే భవిష్యత్తులో సమాధానమ్ చెప్పాల్సివస్తుందని గుర్తేరుగాలన్నారు. బీసీలు బిస్కెట్లకు ఆశపడ్డన్ని రోజులు బానిస బతుకులు తప్పవని, బీసీల కోసం పరితపిస్తున్న నాయకునికి అండగా నిలవాల్సింది పోయి వెన్నుపోటు పొడవటమే కాక ఇంకా విమర్శలు చేయడాన్ని బీసీ సమాజం క్షమించదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో తాజామాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్, బీఆరెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గద్దల శంకర్, బీఆరెస్ సీనియర్ నాయకుడు వేగోలపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో వరుస దొంగతనాలు





**-జంకుతున్న ప్రజలు....**

**వెల్గటూర్/జగిత్యాల/అక్షరం న్యూస్:** మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి వరుసగా తాళం వేసి ఉన్న మూడు ఇండ్లతో పాటు ఒక షాపులో దొంగలు బీభత్సం సృష్టించి పోలీసులకు సవాల్ విసిరారు.అలాగే ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగలించి పెట్రోలు అయిపోవడంతో వదిలేసి పోయారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి తాళాలు పగులగొట్టి దొంగతానికి పాల్పడుతున్నారు.ఒక ఇంటిలో ఐదు తులాల బంగారంతో పాటు పదితులాల వెండి, మరో రెండు ఇండ్లలో బీరువాలు పగులగొట్టి చూడగా అందులో ఏమి లభించకపోవడంతో వస్తువులను చిందర వందరగా పడేసారు.అదేవిధంగా మంచిర్యాల కరీంనగర్ రహదారిపై పక్కన ఉన్న ఆటో స్టోర్ షాపులో షెటర్ ను రాడుతో పైకి లేపి అందులో ఉన్న ఐదు వేల రూపాయలను తీసుకెళ్లడమే కాకుండా సిసి టివి డివిఆర్ ను ఎత్తుకెళ్లడమే కాకుండా సమానును చెల్లా చెదురు చేశారు.అలాగే శుక్రవారం రాత్రి కూడా గ్రామ పంచాయతీ సమీపంలో ఓ ఇంట్లో దొంగలు పడ్డారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వరుసగా మండల కేంద్రంలో దొంగతనాలు జరగడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా తాళం వేసి ఉన్న ఇండ్లనే దొంగలు టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇక పోలీసులు జగిత్యాల జిల్లా క్లూస్ టీమ్ తో ఆధారాలు సేకరించారు.ఎవరైనా ఊరి ప్రయాణాలు చేసే అవకాశం ఉంటే ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ,ముఖ్యంగా ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్ ఐ ఉమా సాగర్ కోరుతున్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు

**- ఎస్. ఐ. శ్రీకాంత్**



**మద్నూర్ /జూన్ 01(అక్షరం న్యూస్ - కామారెడ్డి ):** మద్నూర్ స్థానిక ఎస్. ఐ శ్రీకాంత్ పర్టీలెజర్ (మందుల ) షాపులను తనిఖీ చేయడం జరిగింది. శనివారం రోజున ఎస్. ఐ. శ్రీకాంత్ మండల వ్యవసాయ అధికారి మద్నూర్, మెనూర్, పెద్ద ఎక్లరా గ్రామాలలో ఉన్నటువంటి ఫర్టిలెజర్, పేష్టిసైడ్ మరియు సీడ్స్ షాపులకు వెళ్లి గోదాములను పర్శిలించడం జరిగింది . ఎస్. ఐ. శ్రీకాంత్ దుకాణ యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. దుకాణ యజమానులకు వ్యవసాయ రైతులకు నాణ్యమైన మంచి కంపెనీకి చెందిన విత్తనాలను అమ్మాలని కోరారు. ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన వారి పై చట్టపరమైన చర్యలు తీస్కొని జెలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ రైతన్నలకు మోసం చేసిన ఎంతటి వారైనా వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారి షాపు యజమానులకు ప్రింట్ రేటు కంటే ఎక్కువగా అమ్మిన, వారికి రసీదు కచ్చితంగా ఇవ్వాలని కోరారు. లేని యెడల షాపు లైసెన్స్ పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



**హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్ 01(అక్షరం న్యూస్):ం** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల వ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం పెద్ద హనుమాన్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొప్పూరు గ్రామంలో గల పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది వెంకటనారాయణ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారి పల్లకీ సేవ, భజన సంకీర్తనలతో చేపట్టారు.అంతకు ముందు స్వామి వారికి అర్చకులు ఆకుల పూజ, పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్, చంద్రశేఖర్ గుప్తా, ఆలయ చైర్మన్ కాసం రమేష్, పొన్నాల మురళి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ములుగు/నూగూరు వెంకటాపురం/జూన్ 1/అక్షరం న్యూస్:** రక్తదానం మరొకరికి ప్రాణదానమని రెడ్ క్రాస్ సంస్థ మెడికల్ ఆఫీసర్ సందీప్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ సహకారంతో చేయూత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పాల్గొన్న దాతల నుండి 30 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ వారికి అందించారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం సందర్బంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిడెం సాయి ప్రకాష్ అన్నారు.రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు అత్యవసర సమ యంలో రక్తాన్ని వినియోగించడం జరుగు తుందని తెలిపారు.రక్తం దానం చేసి తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన డిప్యూటీ తాసిల్దార్ మహేందర్,విద్యుత్ శాఖ ఇంజనీర్ సునీల్, విద్యుత్ సిబ్బందిని అభినం దించారు.రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయుటకు కృషిచేసిన ఆకుల కిషోర్,గోపి, విద్యుత్ శాఖ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు





**ములుగు/నూగూరు వెంకటాపురం/జూన్ 1/ అక్షరం న్యూస్.** హనుమాన్ జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసింది.ఆయా గ్రామాల్లో అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా జరుపుకున్నారు.తెల్లవారు జాము నుంచే ఆలయాలకు చేరుకొని ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో,మంగపేట రోడ్ లో వేంచేసియున్న ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి మందిరం వద్ద ఆలయ కమిటీ వారు అర్చకులచే ఘనంగా ప్రత్యేక పూజలు జరిపించారు.స్వామివారికి పంచామృత అభిషేకాలు,సహస్రనామ పూజార్చన,సింధూర పూజ,నాగవల్లి దళార్చన మరియు తెల్ల జిల్లేడు పుష్పార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద ఏర్పాటుచేసిన పందిళ్లలో కూర్చుని స్వామి వారి పూజా కార్యక్రమాలను తిలకించిన భక్తులు తన్మయత్వంతో పరవశించారు.రామచంద్రపురం,చొక్కాల,సూరవీడు, ఆలుబాక,మరికాల, బెస్తగూడెం,అనేక గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు.అనంతరం ఆలయాల వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## మహిళలకు ఉపాధి కల్పన..

**- దిశగా పర్పుల్ డిఎన్ఏ సొసైటీ**




**ఖమ్మం/ వైరా జూన్ 1 (అక్షరంన్యూస్):** మహిళలకు వివిధ రకాలుగా ప్రోత్సాహాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో వారు ఆర్థికంగా ఎదుగుదలకు సహకరించాలి అనే ఆలోచనతో, పర్పుల్ డిఎన్ఏ సొసైటీ స్థాపించడం జరిగిందని లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు, సొసైటీ ఉపాధ్యక్షులు చోడవరపు బద్రీనాథ్ అన్నారు. స్థానిక సాయిరాం మెడికల్స్ నందు పర్పుల్ డిఎన్ఏ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు చిత్తలూరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో మహిళలకు 2 కుట్టు మిషన్లు స్నానాల లక్ష్మీపురం, కు చెందిన మేరీకి తాటిపూడి కి చెందిన కరుణకు అందజేస్తున్న సందర్భంగా వారు మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు, సొసైటీ ఉపాధ్యక్షులు చోడవరపు బద్రీనాథ్, క్లబ్ కార్యదర్శి అబ్బూరి రమేష్, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు, బాధ్యులు వనమా చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ తప్పదు

**- ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు**




**జనగామ జిల్లా/రఘునాథపల్లి,/( అక్షరం న్యూస్ ) జూన్ 1:** మండల కేంద్రంతో పాటు మండలంలోని ఎరువులతో పాటు విత్తనాలు విక్రయించే దుకాణాలను పోలీసులతో పాటు తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వారు ప్రతి దుకాణంలో పత్తి విత్తన ప్యాకెట్లు, లైసెన్ కు సంబంధించిన పత్రాలు, స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ వివరాలు, బిల్ బుక్స్, స్టోర్ సర్టిఫికెట్ తదితర వివరాలను నిశితంగా పరిశీలించారు. విత్తన ప్యాకెట్లను ఎంఆర్పికి మించి విక్రయించవద్దని ఎరువులు, విత్తనాల దుకాణాల యాజమానులను ఆదేశించారు. అలాగే రైతులు సైతం లూజు విత్తనాలను కొనుగోలు చేయ వద్దని, విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా విత్తనాలు కొన్న షాపు నుండి రసీదు తీసుకోవాలని సూచిం చారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నరేష్, తహసీల్దార్ పి.యుగేందర్, మండల వ్యవసాయ అధికారి కాకి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మే నెలలో ఆర్జి-3 94 శాతం అడ్రియాల 96 శాతం ఉత్పత్తి

**- జిఎం ఎన్ సుధాకర్ రావు**




**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 01 అక్షరం న్యూస్ :** మే నెలలో ఆర్జి 3 ఏరియా 94 శాతం, అడ్రియాల ప్రాజెక్ట్ 96 శాతం ఉత్పత్తి సాధించిందని ఆర్.జి-3 జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర రావు తెలిపారు. శనివారం మే నెల బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా వివరాలను ఆర్.జి-3 జనరల్ మేనేజర్ ఎన్.సుధాకర రావు, ఎ.పి.ఎ ఇంఛార్జి జీ.ఎం బి.సత్యనారాయణ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. సందర్భంగా జి.ఎం ఎన్.సుధాకర రావు మాట్లాడుతూ మే నెలలో ఆర్.జి-3 ఏరియాకు నిర్దేశించిన 5.48 లక్షల టన్నులకు గాను 5.16 లక్షల టన్నులు అనగా 94 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు నిర్దేశించిన ఓ.బి (మట్టి) 31.30 లక్షల క్యూబిక్ మీటర్ల లక్షానికి గాను 30.67 క్యూబిక్ మీటర్లు అనగా 98 శాతం మట్టినీ వెలికి తీయడం జరినదని, మరియు 7.66 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. ఎ.పి.ఎ ఇంఛార్జి జి.ఎం బి. సత్య నారాయణ మాట్లాడుతూ అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా మే నెలకు నిర్దేశించిన 0.92 లక్షల టన్నులకు గాను 0.88 లక్షల టన్నులు అనగా 96 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు 0.87 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు.

## కౌశిక్, కార్తీక్‌కు మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత..



**ఖమ్మం/వైరా జూన్ 1 (అక్షరంన్యూస్):** ఇటీవల కోదాడ దగ్గర జరిగిన రోడ్డు యాక్సిడెంట్ లో ఒకే కుటుంబానికి చెందిన 6 గురు మృతి చెందిన సంఘటనతో అనాథలుగా మారిన మృతులు కృష్ణంరాజు, స్వర్ణకుమారి దంపతుల కుమారులు కౌశిక్, కార్తీక్ మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత అందించారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం నల్లమల్ల చంద్రావు, నల్లమల్ల మాణిక్యం, నల్లమల్ల కృష్ణరాజు, నల్లమల్ల స్వర్ణకుమారి తోపాటు మరో ఇద్దరు హైదరాబాదు నుండి విజయవాడ వెళ్తుండగా కోదాడ దగ్గర రోడ్ యాక్సిడెంట్లు మృతి చెందిన సంఘటనలో అనాథలుగా మారిన చిన్నారుల విషయం బోనకల్ మనం రిపోర్టర్ మంద సత్యానందం తెలుసుకున్న వైరా పట్టణానికి చెందిన మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత శనివారం గోవిందపురం గ్రామంలోని వారి ఇంటి దగ్గరకు వెళ్ళి చిన్నారులకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గుడిమెట్ల రజిత మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ఆరుగురు చనిపోవడం చాలా బాధాకరమని, మానవత్వంతో దాతలు ముందుకు వచ్చి కౌశిక్, కార్తీక్ మరో ఇద్దరు పిల్లలను సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమాజం పట్ల బాధ్యతగా ఆపదలో ఉన్నవారికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తున్న మార్పు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, శ్రేయోభిలాషులులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం). గోవిందాపురం(ఎల్)గ్రామ శాఖ సెక్రెటరీ కోట కాటయ్య, వైయస్సార్ పార్టీ నాయకులు ఇరుగు జానేష్, బిఆర్ఎస్ నాయకులు జెడ్.ఎమ్ వీరబాబు, మనం రిపోర్టర్ మందా సత్యానందం, కొత్తపల్లి జాను, వారి కుటుంబ సభ్యులు నల్లమల్ల పరుశురాం, నల్లమల్ల రమేష్, కిట్టమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం.. శ్రీసీతారాముల కళ్యాణం





**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ), జూన్ 1:** మండలంలోని కంచనపల్లి హనుమాన్ దేవాలయం ఆవరణలో హనుమాన్ జయంతిని పురస్కరించ కొని హనుమాన్ మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో శనివారం శ్రీసీతారాముల వారి కళ్యాణమహోత్సవాన్ని కమనీయమైన వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణమహోత్సవాన్ని తిలకించారు. అనంతరం హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మెగు ఉపేంద్ర శర్మ, రంగోజు ఈశ్వరయ్య, హనుమాన్ మాలధారణ భక్తులు నాగులగాని నాగేశ్వర్, కంటేవాడ మహేందర్, పేర్వారి నానాజీ, చొక్కారావు, మేకల శ్రీనివాస్, గాజులపాటి కిషన్ రావు, మాసంపల్లి రాంబాబు, ప్రదీప్, కొలిపాక శ్రీనివాస్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ టెంపుల్‌లో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు





**జ్యోతి నగర్ జూన్ 1 పెద్దపల్లి జిల్లా అక్ష రం న్యూస్:** మార్కండేయ కాలనీ 26 డివిజన్ లోని హనుమాన్ టెంపుల్ లో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శ నివారం ఉదయం రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మనాలి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగుండం నియోజకవర్గ ప్రజలకు సేవా చేసే శక్తి ఇవ్వాలని అదేవిధంగా నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కలు చెల్లించారు, అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# తెచ్చుకున్న తెలంగాణాను కాపాడుకోవాలి

**- ప్రజలకు నామ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు**

**- పార్టీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**- చరిత్ర ఉన్నాళ్లు కేసీఆర్ ప్రజల గుండెల్లో పదిలం**

**- కేసీఆర్‌కు అండగా నిలవాలి...**

**- బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పిలుపు..**



**ఖమ్మం/ తల్లాడ జూన్ 1 (అక్షరంన్యూస్):** తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు బీఆర్ ఎస్ పార్టీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఇక్కడ పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా జరుగుతున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో అంతా పాల్గొని భాగస్వాములు కావాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమించి, సాధించుకున్న తెలంగాణాను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. కేసీఆర్ ప్రాణాలు ఫణంగా పెట్టి, తెలంగాణాను సాదించుకున్నామని, గత పదేండ్లలో ఎంతో ప్రగతి సాదించుకున్నామని ప్రజల జీవితాల్లో కూడా సమూల మార్పులు తీసుకురావడమే కాకుండా ప్రతి తెలంగాణా బిడ్డ సగర్వ%శీ%గా చెప్పుకునేలా రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా చేసుకున్నామని చెప్పారు.దేశం గర్వించేలా కేసీఆర్ తెలంగాణా ను అన్ని విధాలా అభివృద్ధి చేశారని అన్నారు. కష్టపడి సాధించుకుని, అభివృద్ధి చేసుకున్న తెలంగాణాను విచ్ఛిన్న %శీ% కాకుండా జాగ్రత్త పడాలని, కేసీఆర్ కు అండగా నిలవాలని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.తెలంగాణా కల సాకారం చేసుకుని,బంగారు తెలంగాణా గా రుదిద్దిన కేసీఆర్ చరిత్ర ఉన్నన్ని రోజులు తెలంగాణ ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటారని నామ స్పష్టం చేశారు.

# నిమ్స్ తరహాలో ప్రభుత్వ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

**- సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**




**ఖమ్మం/ తల్లాడ జూన్ 1 (అక్షరంన్యూస్):** మూడు రాష్ట్రాల నుంచి ఆరోగ్య చికిత్సలు కోసం వేలాదిమంది పేదలు ఖమ్మం వస్తుంటారని, వారికి మెరుగైన వైద్యం కోసం నగరంలో హైదరాబాద్ నిమ్స్ తరహాలో నూతన హాస్పిటల్ నిర్మించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ, బివికె కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరం మంచికంటి హల్ లో శనివారం జరిగిన ఉచిత మెడికల్ క్యాంపుకు వందలాది మంది పేషెంట్లు వచ్చారు. బిపి, షుగర్, చెవి ముక్కు,గొంతు, పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.
ఈ సందర్భంగా జరిగిన సభలో నున్నా నాగేశ్వరరావు , మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి నెల నెలా మెడికల్ క్యాంపు నిర్వహించడం నమ్మకమైన, నాణ్యతకు చిరునామాగా ఈ మెడికల్ క్యాంపు మారింది అని కొనియాడారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ పోస్ట్ లు చాలా ఖాళీగా వున్నాయని, గుండె పరీక్షలు నిర్వహించడానికి ఒక పర్మనెంట్ డాక్టర్ ను నియమించాలని డిమాండ్ చేశారు.ఆరోగ్య రంగంలో నూతన ఆవిష్కరణలు వేగంగా అభివృద్ధి చెందాయి అని ఈ నేపథ్యంలో నిమ్స్ తరహాలో హాస్పటల్ ను ఖమ్మంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు . చుట్టుపక్కల వివిధ రాష్ట్రాల నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి పేషెంట్లు వస్తున్నారని, సౌకర్యాలు మరింత పెరిగేలా వైద్య సదుపాయాలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, మారిన ఆహారపు అలవాట్లు, బిజీ జీవనశైలితో ఎన్నో వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు , రాబోయే కాలంలో మరింతగా ఆధునిక వైద్య సౌకర్యాలు ఈ మెడికల్ క్యాంపులో ఉచితంగా కల్పిస్తామని ఆయన తెలిపారు. ప్రముఖ డాక్టర్లు సి.భారవి, పిల్లలమర్రి సుబ్బారావు, రావిళ్ళ.రంజిత్, రాజేష్ జెట్ల.రంగారావు పేషెంట్ లను పరిక్షించి నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ ఎన్ ఆర్ ఐ బాబు , పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ , నాయకులు వై శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, పి ఝాన్సీ, నర్రా రమేష్, వాసిరెడ్డి వీరభద్రం, సిహెచ్ బద్రం, జె వెంకన్న బాబు, పి వాసు, అఫ్జల్ , పి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చిరొట్ట ఎరువుల వల్ల దిగుబడి పెరుగుతుంది

**- లైసెన్స్ దుకాణంలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి**

**- ఎరువుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఏవో అలివేణి**



**పెద్దపల్లి టౌన్ జూన్ 01 అక్షరం న్యూస్ :** పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్ లో గల గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని శనివారం పెద్దపల్లి వ్యవసాయ అధికారిని అలివేణి ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా దుకాణంలోని విత్తన ప్యాకెట్లు మరియు రికార్డులను పరిశీలించారు అనంతరం ఏవో అలివేణి మాట్లాడుతూ పెద్దపల్లి మండలంలో విత్తనాల కొరత లేదని తెలిపారు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు మంచి విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు బోర్డుపై లైసెన్స్ వివరాలు డిస్ప్లే చేసిన దుకాణంలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు పత్తి దిగుబడి యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుందని అన్నారు నల్లరేగడి భూములలో పత్తి దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు రసాయన ఎరువులను తగ్గించి పచ్చి రొట్ట ఎరువులు లేదా జీవన ఎరువులను వాడాలని సూచించారు పచ్చి రొట్ట ఎరువులు జీవన ఎరువులు వాడటం వల్ల భూసారం పెరిగి పెట్టుబడి తగ్గుతుందని దిగుబడి పెరుగుతుందని అన్నారు పచ్చిరొట్ట విత్తనాలు డీసీఎంఎస్ గోదాములు ఆగ్రోస్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609